ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

ప్రభాతవార్త

గురువారం 23, జులై 2026 16 పేజీలు





# ముఖ్యమంత్రి ఆదేశాలు బుట్ట దాఖలు

## కూలిన పిల్లర్ వద్ద "బాటిల్‌నెక్" నిర్మాణం

తొమ్మిదివేల క్యుసెక్కుల వరద ప్రవాహానికి అడ్డుకట్ట

సూపర్‌పాసేజ్ "కాలమ్" పై ఇంజనీర్లకే నమ్మకం లేదా ఏమి

విధ్వంసాన్ని సరిచేసేపనులు ఇవేనా

మీ పునర్నిర్మాణ నాణ్యత అంతా డొల్లతనమేనా

48 వ కిలోమీటర్ వద్ద ఇంజనీర్ల మళ్ళింపు చర్యలు

దీనికి సెంట్రల్ డిజైన్ అనుమతులున్నాయా

భవిష్యత్తులో సంభవించే ఉపద్రవాలపై నిపుణుల ఆందోళన



# సీతారామా కాలువల్లో.. "అవినీతి" పారుదల

**అశ్వారావుపేటప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వ అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ "సీతారామా ఎత్తిపోతల" పనుల్లో డొల్లతనం ఎక్కడో ఓ చోట ఏదో రూపంలో బయటపడుతున్నది. ప్రస్తుతం 9వేల క్యుసెక్కుల గోదావరి నీటిని శక్తివంతమైన మోటార్లు ఎత్తిపోస్తుంటే., దీని ప్రధాన కాలువలు ఈ జలనిధిని ఖమ్మం జిల్లాకు విజయవంతంగా మోసుకుపోతున్న విషయం తెలియంది కాదు. సిఈ నుంచి ఎఈ దాకా ఒక్క లస్కర్ సాయం లేకుండా నిరంతరం ఈ మహాయజ్ఞంలో సమిధలై పనిచేస్తున్నారు. అందుకు వారంతా సదా అభినందనీయులు. ఐతే నిర్మాణంలో చోటుచేసుకుంటున్న లోసుగులు.,నాణ్యతా లేమి.,తదనుగుణ అవినీతి ఆరోపణలు వంటి రుగ్మతలతో ఈ మెగా స్ట్రక్చర్ అభాసుపాలవుతున్న మాట కూడా నిజం. 2016 సంవత్సరంలో కేవలం రూ.7926 వేల కోట్ల అంచనాలతో మొదలై.,ప్రస్తుత 2026 నాటికి అది ఏకంగా రూ.24వేల కోట్లకు చేరిన విషయం మనందరికీ తెలిసిందే. అంటే ఇన్నివేల కోట్ల ప్రజాధనంతో సాగాల్సిన నిర్మాణాల విషయంలో నాణ్యత ఎంత ప్రాధాన్యమో చెప్పక్కర్లేదు. ఈక్రమంలోనే కెనాల్ 48 వ కిలోమీటర్ స్ట్రెచ్ వద్ద (ముల్కలపల్లి పంప్‌హౌస్ సమీపంలో) చోటుచేసుకున్న అక్రమాలపై ప్రభాతవార్త మచ్చుతునకగా ఈ కథనాన్ని అందిస్తున్నది.

### గత విధ్వంసాన్ని సరిచేయకుండా కాలువలో "బాటిల్‌నెక్"

సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్ 4 వ ప్యాకేజ్‌లో సరిగ్గా 48 వ కిలోమీటర్ స్ట్రెచ్ వద్ద 2025 సంవత్సరం ఏప్రిల్లో.,ప్రధాన కాలువమీద నిర్మించిన 75 అడుగుల సూపర్ ప్యాసేజ్ పిల్లరొకటి నిలువునా కూలింది. రాష్ట్ర వ్యాప్తంగా దీనిపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తి ఇరిగేషన్ తలదించుకోక తప్పింది కాదు. ఆనాడు సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై స్పందించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

2వ పేజీలో...

# భద్రాద్రిలో శ్రీరామాత్మక .. వరుణయాగం

తొలి ఏకాదశి రోజున వేదఘోషల మధ్య ప్రత్యేక యాగం

రాష్ట్ర సుభిక్షం కోసం శ్రీసీతారాముల సన్నిధిలో వరుణదేవునికి ప్రార్థనలు

**భద్రాచలం, జూలై 22( ప్రభాతవార్త)**

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పుష్కలంగా పండాలని ఆకాంక్షిస్తూ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేకంగా "శ్రీరామాత్మక వరుణయాగం" నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాలు, వైదిక పండితుల సూచనల మేరకు

2వ పేజీలో...



# బోగస్ డాక్టర్ వ్యవహారంలో అధికారుల పాత్రపై ప్రశ్నలు..!



స్వతంత్ర విచారణకు పెరుగుతున్న డిమాండ్

రిక్రూట్ మొత్తం రాష్ట్ర స్థాయిపరంగానే జరుగుతుంది: డీసీహెచ్ఎస్ రవిబాబు

**కొత్తగూడెం, జూలై 22 ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ వైద్యుడి విద్యార్హతలపై వ్యక్తమవుతున్న ఆరోపణలు జిల్లాలో సంచలనంగా మారాయి. నకిలీ ధ్రువపత్రాలతో

నియామక ప్రక్రియపైనే అనుమానాలు..

# గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారితో ఖమ్మం అభివృద్ధి

## మంత్రి తుమ్మల

ఆగస్టు 1 నుంచి ఖమ్మం నగర ట్రాఫిక్‌కు భారీ ఉపశమనం

దంసలాపురం, కల్లూరు, సత్తుపల్లి వద్ద ప్రజల కోసం ప్రత్యేక ఎగ్జిట్లు ఏర్పాటు

ఖమ్మం-అశ్వారావుపేట నాలుగు లైన్ల జాతీయ రహదారికి కేంద్రం సూత్రప్రాయ ఆమోదం...

దంసలాపురం గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ఆర్‌ఓబీ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త**

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పూర్తయితే ఖమ్మం జిల్లా అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని, ఆగస్టు 1 నుంచి ఖమ్మం, వైరా, సత్తుపల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి దంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి అసలు ప్రణాళికలో దంసలాపురం వద్ద ఎగ్జిట్ లేకపోయినా, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దంసలాపురం, కల్లూరు, సత్తుపల్లి వద్ద ప్రత్యేక ఎగ్జిట్లు తీసుకొచ్చామని తెలిపారు. దంసలాపురం ఎగ్జిట్ రైల్వే వంతెన ఆధారంగా నిర్మించబడిందన్నారు.ఆగస్టు 1వ తేదీ నుంచి



2వ పేజీలో...

## ముఖ్యమంత్రి ఆదేశాలు బుట్టదాఖలు

### మొదటి పేజీ తరువాయి..

తక్షణం పునరుద్ధరణ చేపట్టాలని ఉన్నతస్థాయి ఆదేశాలందిన మీదట ఆమేరకు చకచకా నిర్ణయాలు తీసుకున్నారు. ఐతే ఏదైతే పిల్లర్ కూలిందో తిరిగి దాన్ని సరిచేసి లేదా అదే ప్రదేశంలో మరో నాణ్యతా నిర్మాణాన్ని చేపట్టడానికి బదులుగా.,ఆ ప్రధాన కాలువలోని నీటి ప్రవాహమే "ఈ పిల్లర్ వైపుకి" రాకుండా ఈప్రదేశంలో (కాలువ మధ్యలో) "బాటిల్‌నెక్" మాదిరి కాంక్రీట్‌గోడ అడ్డంగా నిర్మించి కాలువ వాస్తవ సైజ్‌ని 20శాతానికి పైగా తగ్గించి(రెడ్యూస్) సరికొత్త సాంకేతిన విప్లవానికి తెరలేపారు ఇంజనీర్లు. అంటే కూలిన పిల్లర్‌ని తొలగించి దాని స్థానంలో పూర్తి నాణ్యతతో కొత్త కాలమ్ వేశామని అప్పట్లో అధికారులు పత్రికలవారికి వివరించారు. (పాఠకులు ఈ పదాన్ని బాగా గుర్తుంచుకోవాలి. ఎందుకంటే ఇంజనీర్ల గుట్టురట్టు కాబడే పాయింట్ త్వరలో దీన్నుంచే). అంటే అక్కడికక్కడే నీటి ప్రవాహ మార్గాన్ని నిలువునా చంపేశారని కాస్త కటువుగానే చెప్పవచ్చు. కూలిన పిల్లర్ స్థానే మరో క్వాలిటీ కన్‌స్ట్రక్షన్ జరిగి ఉంటే.,ఈ నీటి ప్రవాహ వేగాన్ని అటువైపు వెళ్ళనీయకుండా ఎందుకు అడ్డుకట్ట వేశారు ? ఇంజనీర్ల నిర్మాణంమీద ఇంజనీర్లకే నమ్మకం సడలి పోయిందా ? మీరెందుకు భయపడుతున్నారు ? ఈ ఇరుకుమార్గంలో పైనుంచి వేగంగా వచ్చే 9వేల క్యుసెక్కుల నీటి ఒరవడి ఏవిధంగా ముందుకు సాగుతుంది ? కొత్త పిల్లర్ నిర్మించి ఉంటే ఈ బాటిల్‌నెక్ అవసరం లేదుకదా ? అంతేనా నెలకూలిన "పిల్లర్ ముక్కనే" భారీ క్రెయిన్స్ సాయంతో లేపి నిలబెట్టి దాంతోనే మసిపూసి మారేడు కాయ ఏమైనా చేశారా ? నిజానికి ఆ ముక్కని తీసి పారేసి ఉంటే అదెక్కడా కాలువ చుట్టుపక్కల కనిపించలేదు ఎందుకని ? ఇలాటి మరెన్నో సాంకేతిక ప్రశ్నలకు సంబంధిత ఇంజనీర్లు సమాధానం చెప్పాల్సి ఉంటుంది

#### "బాటిల్‌నెక్ నిర్మాణంతో" సాంకేతిక అనర్థాలు

సూపర్‌ప్యాసేజ్ పిల్లర్‌కి భయపడి.,కాలువ మధ్యలో దీని వెడల్పుని 20శాతానికి పైగా తగ్గించి పారేసి., చేపట్టిన "బాటిల్‌నెక్" స్ట్రక్చర్ అనేది భవిష్యత్తులో ప్రాజెక్ట్ మనుగడకు గొడ్డలిపెట్టుగా మారుతుందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ రంగంలోని కొందరు సీనియర్ నిపుణులతో ప్రభాతవార్త మాట్లాడి నప్పుడు., వారు అనేక అంతర్గత విషయాలను ప్రస్తావించారు. అసలీ పద్ధతి అశాస్త్రీయమని వాదించారు. అందుకు వారందిస్తున్న అభిప్రాయాలను గమనిద్దాం. ఈ ప్రధాన కాలువలో గోదావరి వైపు నుంచి వచ్చే 9వేల క్యుసెక్కుల నీటి ఒరవడి అనేది ఒక్కసారిగా ఈ బాటిల్‌నెక్ లో చిక్కుకుని అకస్మాత్తుగా ఉప్పెనలా (అఫ్లక్స్) మారి సుడిగుండాలు చెలరేగుతాయని చెబుతున్నారు. 65 అడుగులకు పైగా వెడల్పుతో ఉన్న ఈ ప్రధాన కాలువ బెడ్ గుండా సాగే ప్రవాహానికి ఉన్నట్టుండి ఆటంకం ఎదురైనప్పుడు ఉద్భవించే ఉపద్రవాలు మొత్తం లక్ష్యాన్నే దెబ్బ తీసేలా ఉంటాయంటున్నారు. కాలువ వెడల్పు అకస్మాత్తుగా తగ్గించి పిల్లర్ నుంచి ఎదురయ్యే ప్రమాదాన్ని బైపాస్ చేయడంతో "ద్రవపీడనం ఇబ్బడిముబ్బడిగా" పెరిగి స్మాలర్ ఎగ్జిట్ నుంచి ముందుకు వెళ్ళలేని స్థితిలో ఈ ప్రవాహ వేగం "అప్‌స్ట్రీమ్ స్ట్రక్చర్" ని ధ్వసం చేసే ప్రమాదము న్నదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆమాటకొస్తే "అసలు ఒరిజినల్ డిజైన్‌కి" ఈ చర్య విరుద్ధమనేది తేటతెల్లమ వుతున్నది. దీనిపై ఇరిగేషన్ ఎఇ లక్ష్మయ్య వద్ద ప్రస్తావించగా.,తనకు సంబంధం లేదన్నారు. అది 4వ ప్యాకేజ్ వారిదని., బాధ్యులైన అధికా రుల ఫోన్ నెంబర్లుకూడా తమవద్ద లేవన్నారు. రేపటినుంచీ ఈ నిర్మాణాలపై అనేక ఆసక్తికర వరుస కథనాలను ప్రభాతవార్త అందిస్తుంది. ఇందులో అనేక లొసుగులు బయటికి రాబోతు న్నాయి. రూ.కోట్ల ప్రజాధనం గోదారిపాల వుతున్న బాధాకర అక్రమాలు వెలుగుచూడబోతున్నాయి.

---

## బోగస్ డాక్టర్ వ్యవహారంలో అధికారుల పాత్రపై ప్రశ్నలు..!

### మొదటి పేజీ తరువాయి..

ఉద్యోగం పొందినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఈ వ్యవహారంలో సంబంధిత అధికారుల పాత్రపైనా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోపణలు గతంలోనే అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదనే అంశం ఇప్పుడు చర్చనీయాంశమైంది. వైద్యుడి అర్హతలపై వచ్చిన ఆరోపణలు నియామకానికి ముందే అధికారులకు తెలుసా? లేక.. సమర్పించిన ధ్రువపత్రాల ప్రామాణికతను పూర్తిగా పరిశీలించారా? అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ ఎందుకు జరగలేదు?.. ఈ వ్యవహారంలో బాధ్యులెవరు? వారికి ఎలాంటి బాధ్యత నిర్ణయిస్తారు? అని పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

#### అర్హతలపై అనుమానాలున్నా ఉద్యోగం ఎలా..?

సదరు వైద్యుడి విద్యార్హతలకు సంబంధించిన సందేహాలు నియామకానికి ముందే కొందరు అధికారుల దృష్టికి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. అలాంటి పరిస్థితుల్లో నియామక ప్రక్రియ ఎలా పూర్తయిందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సంబంధిత ధ్రువపత్రాల పరిశీలనలో ఎలాంటి లోపాలు జరిగాయన్న దానిపై సమగ్ర విచారణ అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

#### సమర్పించిన ధ్రువపత్రాలపై పూర్తి స్థాయి పరిశీలన అవసరం

నియామక సమయంలో వైద్య విధాన పరిషత్‌కు సమర్పించిన విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర పత్రాలు అసలైనవేనా లేదా మార్పులు చేసి సమర్పించారా అనే అంశాన్ని లోతుగా విచారించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారిక రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

#### ఫిర్యాదులు వచ్చినా చర్యలు ఎందుకు లేవు..?

ఈ వ్యవహారంపై గతంలోనే ఫిర్యాదులు అందినట్లు ప్రచారం ఉన్నప్పటికీ, వాటిపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదులను నిరక్ష్యం చేశారా? లేక మరేదైనా కారణాల వల్ల విచారణ నిలిచిపోయిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీనిపై బాధ్యుల పాత్రను కూడా విచారించాలని ప్రజలు కోరుతున్నారు.

#### వార్తలతో జిల్లావ్యాప్తంగా చర్చ

ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో నియామకాల పారదర్శకతపై ప్రజల్లో చర్చ మొదలైంది. ప్రభుత్వ వైద్య సేవలు అందించే వ్యక్తి అర్హతలపైనే సందేహాలు నెలకొంటే రోగుల భద్రతపై ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

#### నకిలీ నియామకంపై డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు ను వివరణ అడగ్గా...

రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న నియామకాల్లో భాగంగా స్థానికత విషయం మాకు సంబంధించింది కాదు. రిక్రూట్ మొత్తం రాష్ట్ర స్థాయిపరంగానే జరుగుతుంది. దానికి ప్రత్యేక బోర్డు ఉంది వారు ఎంపిక చేస్తేనే తప్ప మా ప్రమేయం ఏమి ఉండదు. నకిలీ డాక్యుమెంట్లు, అర్హత లేకపోయినా, అర్హత కంటే ఎక్కువ పదవిలో ఉన్న విషయం జిల్లాలో సుమారు నలుగురు ఐదుగురు మంది వైద్యులు ఉన్నారని తెలుస్తోందని అడగ్గా... మేం మాత్రం వారు ఎంబిబిఎస్ అర్హతలు అవి పూర్తి చేశారా... రిజిస్ట్రేషన్ ఉందా లేదా చెక్ చేస్తాము వాటి మీదనే పోస్టింగ్ ఇస్తాము. రిక్రూట్మెంట్ విషయంలో మొత్తం ప్రక్రియ అంత బోర్డు చూసుకుంటుంది. వారి సూచనల మేరకు సర్టిఫికెట్లు మేం పరిశీలిస్తాము. హాస్పిటల్స్ లో ఖాళీల గురించి మేము పంపాల్సిన అవసరం ఏమి లేదు మొత్తం ఆస్పత్రులవారీగా పడకలను బట్టి వైద్యులను నిర్ణయిస్తారు. మొత్తం బోర్డ్ సభ్యులే ఈ ప్రక్రియను నడిపిస్తారు. కేవలం సమాచారం మాత్రమే మా వద్ద నుండి తీసుకుంటారు. కాంట్రాక్ట్ బేస్ మీద వైద్యులను తీసుకునే పద్ధతి ఉంటే అది మాత్రమే మేము తీసుకుంటాము. అంతకుమించి వైద్యుల నియమాకాలు మొత్తం రాష్ట్ర బోర్డు పరిశీలించి నిర్ణయిస్తుంది.

---

## భద్రాద్రిలో శ్రీరామాత్మక వరుణయాగం

### మొదటి పేజీ తరువాయి..

ఈ మహా వైదిక క్రతువును ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) సందర్భంగా జూలై 25, శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఆలయప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. దామోదర్ రావు తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తగినంత వర్షపాతం లేక రైతాంగం ఆందోళన చెందుతున్న తరుణంలో, ప్రకృతి అనుకూలించి సకాలంలో వర్షాలు కురవాలని, భూమాత పచ్చని పంటలతో కళకళలాడాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని సంకల్పించి ఈ వరుణయాగాన్ని నిర్వహిస్తున్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగే ఈ యాగంలో వరుణదేవునితో పాటు శ్రీ సీతారామచంద్ర స్వామివారిని ప్రార్థిస్తూ రాష్ట్ర శ్రేయస్సు కోసం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించ నున్నారు. భద్రాద్రి క్షేత్రంలో జరిగే యాగాలు ఆధ్యాత్మికంగా విశేష ప్రాధాన్యం కలిగి ఉంటాయని, వేద సంప్రదాయంలో ప్రకృతి సమతుల్యత, లోకక్షేమం కోసం ఇటువంటి యాగాలకు ప్రత్యేక స్థానం ఉందని వైదిక పండితులు పేర్కొంటున్నారు. గతంలో కూడా కరవు, అనావృష్టి వంటి విపత్కర పరిస్థితుల్లో నిర్వహించిన వరుణయాగాలు ప్రజల్లో ఆధ్యాత్మిక విశ్వాసాన్ని పెంపొందించాయని గుర్తుచే స్తున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీ స్సులు పొందాలని దేవస్థానం విజ్ఞప్తి చేసింది. ఆలయంలో జరిగే వరుణయాగాన్ని విజయ వంతం చేయడానికి భక్తులందరూ సహకరించాలని కార్యనిర్వహణాధికారి కె. దామోదర్ రావు కోరారు

---



## మూడోసారి పెళ్లయిన అమ్మాయికి కళ్యాణ లక్ష్మి అందజేసిన అధికారులు

### నాయకులు, అధికారుల అండదండలతోనే జరుగుతున్నట్లు ఆరోపణలు

### మండలంలో ఒక్కొక్కటిగా వెలుగులోనికి వస్తున్న వైనం

### జిల్లా అధికారులు మండలం పై దృష్టి సారించాలని మండల ప్రజలు డిమాండ్

చంద్రుగొండ, ప్రభాతవార్త

చంద్రుగొండ మండలంలో వార్తాపత్రికలో బుధవారం వెలువడిన మండలంలో నీ కళ్యాణ లక్ష్మి పథకం కలకలం అనే శీర్షిక మండలములోనే కాదు జిల్లాలోనే ప్రకంపనలు సృష్టించి హాల్ చల్ చేసింది దీంతో ఇలాంటి ఘటనలే మండలంలో మరికొన్ని జరిగినట్లు వెలుగులోనికి వచ్చి కొందరు స్వయంగా ప్రభాతవార్తతో పంచుకున్నారు అందులోనే భాగంగానే చంద్రుగొండ మండలం చంద్రుగొండ మండల రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరవులోనే ...అది మళ్లీ అయ్యన్న పాలెం గ్రామానికి ఆనుకొని ఉన్న దామచర్ల గ్రామంలో వెంకటేశ్వర స్వామి దేవునీ పేరు నామకరణం చేసుకున్న అదే గ్రామానికి చెందిన వెంకటేష్.... వ్యక్తి దయతో అధికారులకు ముడుపులు చెల్లించి మూడవసారి పెళ్లయిన అమ్మాయి కి ఐదు సంవత్సరాల అమ్మాయి ఉన్న ఆమెకు గతంలోని ఒకటి కాక రెండు పెళ్లిళ్లు అయి వివిధ కారణాలతో విడిపోయి మూడో సారీ పెళ్లి చేసి కొన్న ఆమెకు 2024, 25లో పెళ్లయినట్లు అన్ని డాక్యుమెంట్లు సృష్టించి సంవత్సరం క్రితమే అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా కళ్యాణి లక్ష్మి చెక్కును వారికి అందజేసినట్లు ఆ ఊరు ఓ పెద్దాయన తెలపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది అదే విధంగా మండలంలో మరికొన్ని గ్రామపంచాయతీలలో జరిగినట్లు తెలుస్తుంది అందులో పోకలగూడెం గ్రామ పంచాయతీ లో కూడా 2023లో పెళ్లయితే 2025 లో పెళ్లయినట్లు డాక్యుమెంట్ అంత రెడీ చేసి కళ్యాణ లక్ష్మి పథకానికి సిద్ధమవుతున్న వారికి అధికార పార్టీ ముఖ్య నాయకులు తో పాటు గ్రామ కార్యదర్శి కూడా సాకరించినట్లు తెలుస్తుంది నాయకులు అధికారుల అండదండలతో మండలంలో యదేచ్ఛగా నకిలీ పత్రాలతో కళ్యాణ లక్ష్మి పథకానికి తూట్లు పొడుస్తూ లక్షల రూపాయలు ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్న నాయకులు ఎవరు..? వారికి సహకరించిన అధికారులు బయటికి రావాలి అంటే మండలంలో గత రెండు సంవత్సరాల క్రితం నుండి కళ్యాణ లక్ష్మి పథకానికి ఆన్లైన్ చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా సంబంధిత అధికారులు పరిశీలిస్తే కో ..కోల్లగా వెలుగులోకి రానున్నాయి అంటూ మండల ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు .ఇకపోతే బుధవారం ప్రకంపనలు సృష్టించిన కళ్యాణి లక్ష్మి కలకలం అనే శీర్షిక రావడంతో నకిలీ పత్రాలతో కళ్యాణ లక్ష్మి ఆన్లైన్ చేసిన ఘటనలు నెట్ సెంటర్ నిర్వాహకుడే కాకుండా ఓ బడిపంతులు కూడా కీలక పాత్ర పోషించినట్లు మంగళవారం కొన్ని పత్రికలలో వెలువడిన విషయం తెలిసిందే.. మండల ప్రజలు చర్చించుకున్నట్లు అది నిజమే.... అనడానికి ఉదాహరణ గెజిటెడ్ సంతకాలు కోసం తానే స్వయంగా చంద్రుగొండలో గతంలో విధులు నిర్వహించిన ఓ ట్రాన్స్కో అధికారికి ఫోన్ చేసి వీరు మాకు కావలసిన వారు మాకు చాలా దగ్గర అంటూ నమ్మించి నకిలీ కళ్యాణ లక్ష్మి పత్రాలపై ఆ అధికారితో గెజిటెడ్ సంతకాలు చేయించినట్లు ఆ అధికారి స్వయంగా ప్రభాత వార్తకు తెలపడం గమనహార్ధం ఇకపోతే నాన్ గెజిటెడ్ ఆ బడిపంతులు పెట్టినట్లు తెలుస్తుంది ఇవన్నీ పరిగణంలోనికి తీసుకుంటే ఈ సినిమాకి...... కథ స్క్రీన్ ప్లే అంతా ఆ బడిపంతులే అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు అనుకుంటా....ఇంతమంది అధికారులు నాయకులు ఆఖరికి బడిపంతులు అండదండలు ఉండడంతో నెట్ సెంటర్ నిర్వాకుడు నిర్భయంగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలు స్తుంది ఇకపోతే నిర్వాహకుడికి గ్రామపంచాయతీలో జరుగుతున్న అవత వకలన్నీ.... నాకు తెలుసు ....అనే దాని పై ప్రభాతవార్త ఆరా.... తీయుగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోనికి వచ్చాయి చంద్రుగొండ గ్రామ పంచాయతీలోవిధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి నెట్ సెంటర్ నిర్వాహకుడు ఒక్కటై గ్రామపంచాయతీలో మరికొన్ని అక్రమాలకు పాల్పడినట్లు గ్రామపంచాయతీప్రజలు బహిరంగంగానే చర్చించు కుంటున్నారుఆ అక్రమాలు పూర్తి ఆధారాలతో నెక్స్ట ఎపిసోడ్లో చూద్దాం...!

## ఓటు హక్కు కోల్పోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

వైరా టౌన్ జులై 22 (ప్రభాతవార్త)

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 198, 213 పోలింగ్ బూత్‌ల బూత్ లెవెల్ అధికారులు (బి ఎల్ ఓ), బూత్ లెవెల్ ఏజెంట్లు (బి.ఎల్.ఎ)తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలో కొనసాగుతున్న సర్ కార్యక్రమం (ఓటర్ల ప్రత్యేక పరిశీలన కార్యక్రమం) పురోగతిపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయి, ఇంకా ఎన్ని దరఖాస్తులు నమోదు చేయాల్సి ఉంది, ఓటర్ల షిఫ్టింగ్‌కు సంబంధించిన వివరాలు, పెండింగ్ అంశాలపై బి ఎల్ ఓలు, బి ఎల్ ఏ లతో చర్చించారు. కార్యక్రమం వేగవంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎలాంటి కారణాలతోనూ అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రజా ప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో బి ఎల్ ఓ లు ఫాతిమా, నాగూర్‌తో పాటు నాయకులు, ప్రతినిధులు నరేష్, మదుపల్లి కృష్ణ, నాగుల్ పాషా, వెంకట కృష్ణ, కొక్కిరేణి లింగయ్య, మహేష్, మంచికంటి అప్పారావు, బొల్లాపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

### ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన సోదాలు

నేలకొండపల్లి, జులై 22 ప్రభాతవార్త:



రాజేశ్వరపురం గ్రామం లోని అరుణాచలం రైస్ మిల్లులో రాష్ట్ర విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారుల బృందం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు చేపట్టారు. తొలుత రైస్ మిల్లుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రికార్డుల ప్రకారం ధాన్యం స్టాక్ ఉందా లేదా అని క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. మిల్లుకు చెందిన స్టాక్ లాట్లను లెక్కించారు. సీఎంఆర్ విషయం లో అరుణాచలం రైస్ మిల్లు పై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో గతంలో కూడ పలుమార్లు విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కాగా, సీఎంఆర్ పెండింగ్ చెల్లించటంలో ఎందుకు జాప్యం చేస్తున్నారు, తీసుకున్న ధాన్యంకు సంబంధించిన స్టాక్ ఉందా, లేదా, ఉండి చెల్లించటం లేదా, లేక కావాలనే చెల్లింపులు చేయటం లేదా అనే విషయాల పై క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వచ్చినట్లు తెలుస్తుంది. అందులో భాగంగానే విజిలెన్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన తనిఖీలకు సంబంధించిన కవరేజీ కోసం వెళ్లిన మీడియాను పోలీసులు అనుమతించలేదు. కనీసం ఫోటోలు కూడ తీయటానికి వీలులేదని విజిలెన్స్ డీఎస్పీ ఆంక్షలు విధించారు. అరుణాచలం మిల్లులో దాడుల నేపథ్యంలో మండలం లోని ఇతర రైస్ మిల్లుల యజమానులు ఉలిక్కిపడ్డారు. ఈ దాడులు విజిలెన్స్ డీఎస్పీ ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్పెక్టర్స్, ఎస్సైలతో పాటు కానిస్టేబుల్స్. స్థానిక పోలీసులు, సివిల్ సప్లై అధికారులు ఈ దాడులలో పాల్గొన్నారు.

## మత్స్య రైతులు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

.కూసుమంచి, జులై 22 (ప్రభాతవార్త ) :

మత్స్య రైతులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పాలేరు మత్స్య స్థానం అధిపతి ఎం శ్యామ్ కుమార్ మత్స్యకారులకు సూచించారు. బుధవారం షెడ్యూల్ కాస్ట్, షెడ్యూల్ ట్రైబ్ మచ్చ రైతులకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ కుమార్ మాట్లాడుతూ..జలాశయాలలో చేపల పెంపకం యాజమాన్య పద్ధతులు అను అంశంపై మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం మొదటి రోజు విజయవంతంగా ప్రారంభమైందన్నారు. రోజు రోజుకు మంచినీటి చేపలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ భారీగా పెరుగుతా వుంది ఎందుకంటే చేపలలో చౌకగా లభించే మాంసకృతులు, ఏమైనో ఆమ్లాలు, విటమిన్లు మంచి కొవ్వు పదార్థాలు మెండుగా ఉంటాయి కావున మన రాష్ట్రంలో ఉన్న మంచినీటి వనరులలో మన తెలంగాణ మత్స్యకారులు శాస్త్రీయ పద్ధతిలో యాజమాన్య పద్ధతులను పాటించి తమ చేపల దిగుబడిని రెట్టింపు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్రాన్ని చేపలకు ఒక ముఖ్య కేంద్రంగా తయారు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బి. రవీందర్, డాక్టర్ జి. గణేష్, బి. దివ్యలు పెంపకం దారులకు పలు సూచనలు చేశారు.

## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ-చార్జిని ఖండిస్తూ. మాస్ లైన్ రాస్తారోకో

కొణిజర్ల జులై 22ప్రభాత వార్త:

మండల పరిధిలో తీగల బంజర గ్రామంలో ఢిల్లీలో నిరసనసేపటిన విద్యార్థులపై లాఠీచార్జ్ ఘటనపై.. " మాస్ లైన్ రాస్తారోకో చేపట్టారు. డివిజన్ నాయకులు మేడికొండలరావు మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులపై పోలీసు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ,ఆడపిల్లలని లాఠీలతో కొట్టడం, బట్టల్ని చించడం అనాగరిక చర్యలని, నీట్ పేపర్ లీకు పై మోడీ గాని ఇతర మంత్రులు గాని సమాధానం చెప్పటం లేదని ,22 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన సమస్య 12 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని చనిపోయారు . విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని. డిల్లీ లో శాంతియుతంగా చేస్తున్న ర్యాలీపై పోలీసులు లాఠీ దెబ్బలు ,టియర్ గ్రాస్ ప్రయోగించి విద్యార్థులపై దాడి చేయటాన్ని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తీవ్రంగా ఖండిస్తుందని. ఒక్కొక్క మీడియా ఛానల్ లేదా పేపర్ రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉండి నిజాలను దాచి అబద్దాలను ప్రచారం చేస్తున్నారని. దొంగే దొంగ అన్న చాందంగా ఈనాడు బీజేపి ప్రభుత్వం దేశంలో ఎవరు ఇస్తున్న తీరును ఈ పది సంవత్సరాల కాలం నుంచి ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. విద్యార్థులది బతుకు పోరాటం నాణ్యమైన విద్యను అడుగుతున్నారు . నియంతరంతా చరిత్ర హీనులుగా మిగిలిపోయారు. జాతీయ జెండాలు పట్టుకొని. అంబేద్కర్ ఫోటోలతో ర్యాలీ చేస్తున్న వారిపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని కూని చేయటమే ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం స్పందించి విద్యార్థులు డిమాండ్లు నెరవేర్చాలని సిపిఐ మాస్ లైన్ గా మేము విద్యార్థులకు సంపూర్ణ మద్దతుని తెలియజేస్తున్నాను కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు భూక్య బాలు ,ముత్తన బోయిన లెనిన్, రాపోలు కృష్ణ ,చిన్న శీను, చిన్న వెంకటి, గండికోట రమేష్ ,వెంకన్న ,శీను , రాస్, బాబు ,వెంకటేష్, గుగులోతులాల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు

## రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్ళాలి



కామేపల్లి, జులై 22 ప్రభాతవార్త:

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే విధంగా అవగాహన కల్పించాలని తాసిల్దార్ కె వి శ్రీనివాసరావు, మండల పంచాయతీ అధికారి వివిఎస్ శాస్త్రి, మండల వ్యవసాయ అధికారి బి.తారా దేవి, వైరా డివిజన్ ఉద్యాన అధికారి ఆకుల వేణు పంచాయతీ సర్పంచ్ లు, కార్యదర్శులు, ఏ ఈ ఓ లు, జీపిఓలు , పిసా మొబలైజర్లు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు పిలుపు నిచ్చారు. రైతు వేదికలో బుధవారం మండల స్థాయిలో ప్రత్యేక సమావేశంలో ప్రసం గించారు.ఆగస్టు ఒకటి నుండి ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేయాలని కోరారు. రైతులు అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మల్లాలని కోరారు. భూగర్భ జలాలు వేగంగా తగ్గుతున్నందున రైతులు వరి పంటను సాగు చేయొద్దన్నారు.తక్కువ నీటితో రైతులకు లాభదాయకంగా ఉండే ప్రత్యామ్నాయ పంటలైన పెసర, కందులు, అలసంద తదితర పంటలను సాగు చేయాలని కోరారు ఖరీఫ్ లో సాగునీ టి కొరత దృష్ట్యా త్రాగునీటికే అధిక ప్రా ధాన్యత నివ్వాలన్నారు. పం టల సాగుపై గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించి చైతన్య పరచాలని వారు కోరారు.ఈ స మావేశంలో మిషన్ భగీరథ ఏఈ బండి సతీష్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ అంజం రాజు, ఏపీవో అర్వంకి శ్రీరాణి,ట్రాన్స్ కో ఏఈ ఎన్.శ్రీనివాసులు,మండల పరిషత్ పర్యవేక్షకులు తన్నీరు నరేందర్, సీనియర్ అసిస్టెంట్ పాపారావు,ఏఈవోలు బి.జగదీష్, శ్రీకాంత్, దీపక్ రెడ్డి, భాస్కర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పొరుపల్లి లక్ష్మి,మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.నాగులు, ఐబి ఏఈ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## కామేపల్లి వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ డీఎంహెచ్ఓ

కామేపల్లి, జులై 22 ప్రభాతవార్త:

కామేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఐటీడీఏ అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ బెజవాడ సైదులు బు ధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ, లేబర్ రూ మ్,ఇన్ పేషెంట్ వార్డ్ విభాగాలను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రంజిత్ కుమార్, హెచ్ ఇ వో కే.వెంక టేశ్వర్లు, పి హెచ్ ఎన్ స్వర్ణమార్థాబాయ్, సూపర్వైజర్ రాధాకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ సిహెచ్ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ జి.తిరుమలయ్య,ల్యాబ్ టెక్నీషియన్ కల్లూరి ఉమామహేశ్వరరావు,నర్సింగ్ ఆఫీసర్ దీనా ,సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాలు-దారుణాలు

## చెట్టుకు ఢీకొని లారీ డ్రైవర్ మృతి



పెనుబల్లి, జులై 22, ప్రభాతవా ర్త

చెట్టుకు ఢీకొని లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధి లోని టేకులపల్లి గ్రామ శివారులో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి.. అదుపుతప్పిన కంటైనర్ లారీ రోడ్డు పక్కన చెట్టును ఢీ కొట్టడంతో లారీ డ్రైవర్ క్యాబిన్ లో ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సుమారు నాలుగు గంటలపాటు శ్రమించి క్యాబిన్ నుండి లారీ డ్రైవర్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడిని కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన మహమ్మద్ ఆరిఫ్ (30) గా గుర్తించారు. నిద్రమత్తులో డ్రైవింగ్ చెయ్యటంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్త పెనుబల్లి ఆస్పత్రికి తరలించారు. వియం బంజర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కామేపల్లి, జులై 22 ప్రభాతవార్త :

మండలం పాత లింగాల గ్రామం లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు.ఈ సందర్భం గా సమస్యలపై సర్వే నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ కేజీబీవీలో విద్యాలయ భవనం నిర్మాణంలో ఉండటం వలన బాలికలకు సౌకర్యాలు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.బిల్డింగ్ నిర్మాణ పనులు తక్షణమే పూర్తి చేయాలని కోరారు. ఆ పాఠశాలలో 350 మంది విద్యార్థినిలు ఉండాల్సి ఉండగా ఇప్పటివరకు 260 మంది మాత్రమే ఉన్నారని సరైన వసతులు లేక బాలికలు ఆశించిన స్థాయిలో ప్రవేశం పొందడం లేదని తెలిపారు. పాఠశాలలో 15 మంది ఉపాధ్యాయులు ఉన్నారని వారికి క్రమంగా తగిన వేతనం చెల్లించడం లేదని తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, స్కావెంజర్లకు 9000 ఇస్తున్నారని కనీస వేతనం18000 వారికి ఇవ్వాలని కోరారు. నిత్యవసర సరుకులు టెండర్ల ద్వారా కాకుండా ప్రభుత్వమే నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని,విద్యార్థినిలకు ఇప్పటివరకు యూనిఫాం,డ్రెస్సు లు,బుక్కులు కూడా ఇవ్వలేదన్నారు.ఉపాధ్యాయులకు కాలనీ ఏర్పాటు చేసి వారు అక్కడే ఉండే టట్లు చూడాలని అన్నారు.టీచర్లకి నెలకి 50 వేల రూపాయలు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వేతనం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దుగ్గి కృష్ణ,పి.రమ్య,మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్ రెడ్డి,బాదావత్ శ్రీను,రాయల స త్యనారాయణ,ఆమంచి అంజయ్య,ఏర్పుల శాంతయ్య,రాయల నరేష్,పొద్దుటూరి అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.

## పాతలింగాల చెరువుకట్ట నిర్మాణ పనులను పరిశీలించిన్ల గోపాల్ రెడ్డి

కామేపల్లి, జులై 22 ప్రభాత వార్త:



కామేపల్లి మండలం పాతలింగాల చెరువు కట్ట నిర్మాణ పనులను తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి బుధవారం పరిశీలించా రు.క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలని, ఎటువంటి అలసత్వం వహించకుండా నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రామ్ రెడ్డి జగన్నాథరెడ్డి, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్, స్థానిక నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలి

**- బక్కచింతలపాడు నూతన పాఠశాల ప్రారంభం**

**- చిన్నారుల చదువుకి బాటసగా నిలిచిన పోలీసులను**

**దాతలకు అభినందనలు: ఎస్పీ రోహిత్ రాజు**




**చర్ల, జులై 22, ( ప్రభాతవార్త ):**

గిరిజన చిన్నారులు క్షమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలని ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మండలంలోని అత్యంత మారుమూల ప్రాంతం అయిన బక్కచింతలపాడు గ్రామంలో చర్ల పోలీశాఖ ఎస్.ఐ నర్సిరెడ్డి మిత్ర బృందం సహకారంతో నూతనంగా నిర్మించిన పాఠశాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధి విచ్చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మూరుమూల గ్రామాల గిరిజన ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పోలీస్ శాఖ నిరంతరం కృషిచేస్తుందని అన్నారు. అందులో భాగంగా పూసుగుప్ప చెన్నాపురం గ్రామాలలో వైద్యశాలలను నిర్మించామని గతంలో బూరుగుపాడులో చర్ల పోలీస్ శాఖ సహకారంలో పాఠశాల నిర్మాణం జరిగిన విషయాన్ని గుర్తు చేసారు. పిల్లల తల్లిదండ్రులు విధిగా పాఠశాలకు పంపించాలని ఇతర అవసరాల కోసం చిన్నారులను వాడుకోరాదని మంచిగా చదివించి ఉన్నత స్థాయికి వెళ్లే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. మారుమూల అదివాసీ గ్రామాల గిరిజనులు ఏదైన సమస్య ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు. ఏజన్సీ ప్రాంతంలో చదువుకున్న విద్యార్థులకు విద్యా ఉపాధి రంగాల్లో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీస్ శాఖ సిద్దంగా ఉంటుందని తెలిపారు. పాఠశాల నిర్మణానికి కృషి చేసిన సిఐ రాజువర్మ కేశవ్ నర్సిరెడ్డి ( యుఎస్ ఏ) మిత్ర బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డిఎస్పీ అరుణ్ కుమార్ సిఐ రాజువర్మ ఎస్.ఐలు నర్సిరెడ్డి కేశవ్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాహనదారుల భద్రతే లక్ష్యం

**- నిత్యం వాహన తనిఖీలు నిర్వహిస్తాం**

**- అధిక పవర్ ఎల్ఈడి లైట్లపై హెచ్చరిక**



**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:** వాహనదారుల భద్రతే లక్ష ్యంగా నిత్యం వాహన తనిఖీలు చేపడతామని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య అన్నారు. బూర్గంపహాడ్ మండలంలో బుధవారం ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు జరిమానాలు విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని ప్రధాన రహదారులపై చేపట్టిన తనిఖీల్లో అధికారులు వాహనాల ఆర్సి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పియు సి, ఫిట్నెస్ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనాలకు స్థలంలోనే జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎం వి ఐ వెంకట పుల్లయ్య మాట్లాడుతూ, వాహనాలకు అధిక పవర్ గల ఎల్ఈడి లైట్లు, ఫాగ్ లైట్లు, అధిక పవర్ బల్బులు పెట్టడం వల్ల ఎదుటి వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక పవర్ లైట్లు పెట్టిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాంటి వాహనాలపై కేసులు నమోదు చేసి భారీ జరిమానా విధిస్తాం అని స్పష్టంచేశారు. వాహనదారులందరూ తప్పనిసరిగా ఒరిజినల్ డాక్యుమెంట్స్ వెంట ఉంచుకోవాలని, సీటు బెల్ట్, హెల్మెట్ ధరించాలనిఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కు పాల్పడవద్దని సూచించారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

# ఘనంగా దాశరథి జయంతి వేడుకలు

**- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి దాశరథి కవిత్వం**

**చిరస్మరణీయం: ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హవీలా**



**భద్రాచలం, జూలై 22 (ప్రభాతవార్త):**

భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో తెలంగాణ ప్రజాకవి, మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ హవీలా మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి దాశరథి రచనలు ఎనలేని స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో హవీలా మాట్లాడుతూ, నిజాం పాలనకు వ్యతిరేకంగా తన కలంతో పోరాడిన మహాకవి దాశరథి తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ కపిల భారతి మాట్లాడుతూ దాశరథి రచనలు, కవితా వైభవం, గజల్స్, తెలంగాణ ఉద్యమంలో ఆయన సాహిత్య పాత్రను వివరించారు. దాశరథి కవిత్వం తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని నింపి ఉద్యమ స్ఫూర్తిని రగిలించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు డాక్టర్ నందూరి రాంబాబు, అధ్యాపకులు డాక్టర్ నాగసమీర, డాక్టర్ కిరణ్ కుమార్‌తో పాటు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు

# రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిగా ఉంచాలి

**- దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్**



**దుమ్ముగూడెం ప్రభాతవార్త :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ ను బుధవారం సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ కు వచ్చిన జిల్లా ఎస్పీకు సీఐ వెంకటప్పయ్య పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు అనంతరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారువార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు కార్యాలయ నిర్వహణ రికార్డులు సిబ్బంది నిర్వహిస్తున్న విధులు తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు పెండింగ్ దర్యాప్తుల పురోగతి నేరాల నియంత్రణ చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారుప్రాపర్టీ కేసుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించి దొంగిలించబడిన ఆస్తులను త్వరితగతిన స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించేలా దర్యాప్తు చేపట్టాలని సూచించారు రౌడీ షీటర్లు హిస్టరీ షీటర్ల కదలికలను నిరంతరం పర్యవేక్షి స్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారుసీసీటీఎన్ఎస్‌లో నమోదయ్యే కేసులు దర్యాప్తు పురోగతి ఇతర వివరాలను సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారుఅక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మట్కా జూదం కోడి పందాలు పేకాట బెట్టింగ్ గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారుప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడితో బాధ్యతగా వ్యవహరించి త్వరితగతిన సేవలు అందించాలని సూచించారుఅనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది సమస్యలను ఆయన అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారుఈ కార్యక్రమంలో భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య ఎస్‌బీ2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ చర్ల సీఐ రాజు వర్మ ఎస్ఐలు శ్యాంప్రసాద్, జగన్మోహన్ చారి పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు




# ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**భద్రాచలం, ప్రభాతవార్త:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి



ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, నిర్మాణ పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆలయ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి దామోదర్, పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, భీమవరపు వెంకటరెడ్డి, మామిడి పుల్లారావు, నాగేశ్వరరావు, రాయల శ్రీను, గాడి విజయ్, మాచినేని భాను, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లు డ్రైవింగ్ నేరం..

**- అవగాహన సదస్సు లో - ట్రాఫిక్ ఎస్ఐ**

**భద్రాచలంక్రైమ్ జూలై 22 (ప్రభాతవార్త):** మైనర్ విద్యార్థులు వాహనాలు



నడపడం చట్టరీత్యా నేరమని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు హెచ్చరించారు. బుధవారం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తాయని వివరించారు. ఇటీవలి కాలంలో కళాశాల విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. ఎం. కిరణ్ కుమార్, బి. సుధాకర్ రావు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# రైతులకు సాగునీరు అందించే విషయంలో రాజీలేదు..

**- ఎంఎల్ఏ తెల్లం వెంకట్రావు**



చర్ల, జులై 22, ( ప్రభాతవార్త ):

రైతులకు సాగునీరు అందించే విషయంలో బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేయడం తగదని ఎంఎల్ ఏ డా, తెల్లం వెంకట్రావు అన్నారు. రైతాంగ సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని రైతుల పక్షాన ప్రభుత్వం అండగా ఉంటుందని బరోసా కల్పించారు. నియోజకవర్గంలోని చర్ల దుమ్ముగూడెం మండలాల రైతులకు సకాలంలో సాగునీరు అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం కొందరు బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఇలాంటి దుష్ప్రచారాలను వెంటనే మానుకోవాలని రైతులు వాస్తవాలను గుర్తించి పుకార్లను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సాగుకు అవసరమైన నీటిని కుడి ఎడమ కాలువల ద్వారా విడుదల చెయ్యడం జరిగిందని నీటిని పొదుపుగా వాడుకొని పంటలను సాగుచేసుకోవాలని సూచించారు.

# విద్యార్థులకు నాన్యమైన విద్యను అందించాలి

**- వంటశాలల పరిశీలన**

**- మెను ప్రకారం భోజనం అందించాలి**

**- ఎంఎల్ ఏ వెంకట్రావు**



చర్ల, జులై 22 ( ప్రభాతవార్త ):

విద్యార్థులకు నాన్యమైన విద్యను అందించాలని ఈ ఏడాది జరుగనున్న పదవ తరగతి పరిక్షల్లో ఉత్తమ ఫలితాలు రావాలని ఆదిశగా ఇప్పటి నుండే ఓ ప్రణాళిక ప్రకారం విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భుదవారం మండల పర్యటనకు వచ్చిన ఆయన పెదముడిసిలేరు ఆశ్రమ పాఠశాల చినముడిసిలేరులోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు. మెనూ ప్రకారమే భోజనం అందించాలని భోజనం వసతి తదితర విషయాలపై విద్యార్థులతో మాడ్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# తక్కువ ఖర్చుతో ఆధునిక వ్యవసాయ పద్ధతిలో వరి సాగు

- రైతులకు నేల పరీక్షలు, నేరుగా వరి విత్తే పద్ధతిపై అవగాహన
- నీరు, కూలీ ఖర్చులు ఆదా చేసే కొత్త పద్ధతిపై వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కవిరాజు వివరణ



**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:** తక్కువ ఖర్చుతో ఆధునిక వ్యవసాయ పద్ధతిలో వరి సాగు చేసే అధిక దిగుబడును సాధించవచ్చు అని వరి పరిశోధన సంస్థ పరిశోధన అనుబంధ శాస్త్రవేత్త డాక్టర్ కవిరాజ్ అన్నారు. పిఏసిఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో సొసైటీ కార్యాలయంలో ఎఫ్ పి ఓ అరుంధతి అధ్యక్షతన రైతులకు నేల పరీక్షలు, నేరుగా వరి విత్తే పద్ధతి పై ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ వరి పరిశోధన సంస్థకు చెందిన పరిశోధన అనుబంధ అధికారి డా. ఎస్. కవిరాజు ముఖ్య వక్తగా పాల్గొని రైతులకు శాస్త్రీయ సూచనలు చేశారు. రైతులు ముందుగా నేల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. నేలలో ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకుని, పంటకు కావలసిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడితే దిగుబడి పెరుగుతుంది. ఖర్చు తగ్గుతుంది అని వివరించారు. నేరుగా వరి విత్తే కొత్త పద్ధతిని రైతులకు వివరించారు. సాధారణ నాట్లతో పోలిస్తే 30 శాతం నీరు ఆదా అవుతుందని అన్నారు .నారుమడి, నాట్లు వేయించే ఖర్చు ఉండదని వివరించారు. 10 నుండి 12 రోజులు ముందుగానే పంట చేతికి వస్తుంది అని డా. కవిరాజు తెలిపారు. ఈ పద్ధతిలో కలుపు నివారణకు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. అనంతరం పిఏసిఎస్ అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను రైతులందరూ ఆచరించి లాభాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో బత్తిన వెంకట ప్రసాద్, మాజీ ఎంపీపీ కైపు రోసిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ పెద్దిరెడ్డి, మారం శ్రీనివాసరెడ్డి, గాదె నర్సిరెడ్డి, మేకల నరసింహారావు, సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**- దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ డిమాండ్**



దుమ్ముగూడెం ప్రభాతవార్త: నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీక్ ఆరోపణలు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు యువతలో తీవ్ర ఆందోళ అభద్రతకు కారణమయ్యాయని అందుకు బాధ్యత వహించి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ కమిటీ డిమాండ్ చేసింది కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ పలువురు పార్టీ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ములకపాడు గ్రామంలోనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూవిద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అత్యంత కీలకమైన అంశంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా లాఠీ ఛార్జి, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారుప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలియజేయడం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని అలాంటి నిరసనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, యువత విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం బలవంతంగా అడ్డుకోవడం అత్యంత దురదృష్టకరమని ఇటువంటి ఘటనలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు ఈ కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి సీతారామారావు మోటుపల్లి నటరాజస్వామి దర్శి సాంబశివరావు పైడిగూడెం సర్పంచ్ కంగాల వెంకటేష్ జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ కనుబుద్ది దేవ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ది ప్రవీణ్ కెల్లా శేఖర్ గడ్డం బాలాజీ జీరి సత్యనారాయణ రెడ్డి లంకా ప్రసాద్ సందీప్ రెడ్డి సోడి సందేశ్వరావు కుంజా మల్లేష్ పాయం రాంబాబు సత్తిబాబు యడ్ల శంకర్ నీలంబాబు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిర్దావర్ పై చర్యలు చేపట్టాలి

దుమ్ముగూడెం ప్రభాతవార్త :

భూభారతి గ్రామ సభలకు హాజరు కాకుండా నిరక్ష్యంగా వహించిన దుమ్ముగూడెం గిర్దావర్ పై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని దుమ్ముగూడెం మండలం పైడిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ కంగాల వెంకటేష్ పలువురు వార్డు సభ్యులు ములకనాపల్లి గ్రామ ప్రజలు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు మంగళవారం ములకనాపల్లి గ్రామంలో భూభారతి గ్రామసభకు గ్రామంలో ఉన్న అనేకమంది ప్రజలు హాజరై గిర్దావర్ కోసం ఎదురు చూశామని భూ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించాలని హాజరవ్వగా గ్రామ సభకు రావలసిన గిర్ధవర్ రాకుండా నిరక్ష్యంగా వ్యవహరించారని అందుకు ఉన్నతాధికారులు శాఖపరమైన విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు

# ఘనంగా దాశరధి జయంతి

**దుమ్ముగూడెం ప్రభాతవార్త:** తెలంగాణ సాహితీయోధుడు పద్య రచన కావ్య పితామహుడు దాశరధి కృష్ణమాచార్య 101 వ జయంతిని బుధవారం లక్ష్మీనగరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధార్మిక ఆధ్యాత్మిక కళాకారుడు పిలక నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో దాసరధి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ పద్య రచన ప్రావీణ్యానికి తెలుగు సాంస్కృతి సాహిత్యానికి దాశరధి ఎనలేని కృషి చేశారని నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న నినాదంతో నిజ్నా కాలంనాటి నిరంకుశ పాలనపై జైలు గోడలపై తన కవితతో తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్ని ధారగా మలిచి తెలంగాణ ఏర్పాటు కోసం ఎనలేని కృషి చేశారని ఆయన కొనియాడారు దాశరధి కృష్ణమాచార్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23న రవీంద్రభారతిలో అధికారికంగా నిర్వహిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు అలాగే దాశరధి పేరట ప్రత్యేక పురస్కారాలు అవార్డులు అందిస్తున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

దుమ్ముగూడెం ప్రభాతవార్త :





దుమ్ముగూడెం అటవీ రేంజ్ పరిధిలోని చర్ల మండలం ఆర కొత్తగూడెం గ్రామ సమీపంలో అక్రమంగా చర్ల వైపు నుండి భద్రాచలం వైపు టాటా మ్యాజిక్ వాహనంలో మూడు దిమ్మలను తరలిస్తుండగా దుమ్ముగూడెం రేంజ్ అధికారి కమల ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడి చేసి పట్టుకున్నారు పట్టుకున్న వాహనాన్ని కలపను దుమ్ముగూడెం అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు దాడిలో పట్టుకున్న కలప విలువ సుమారు 32 వేలుగా ఉంటుందని అంచనా వేశారు ఈ దాడుల్లో దుమ్ముగూడెం అటవీ రేంజ్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో జాతీయ పతాక దినోత్సవం

ఖమ్మం విద్యా విభాగం జులై 22, ప్రభాత వార్త:



ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో జాతీయ పతాక దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ ఐక్యత, జాతీయ పతాకం పట్ల గౌరవ భావాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భారత జాతీయ పతాకాలను చేతబూని దేశభక్తి గీతాలాపనతో పాటు జాతీయ జెండా ప్రాముఖ్యత, త్రివర్ణ పతాకంలోని మూడు రంగుల విశిష్టత, అశోక చక్రం సందేశం గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి ప్రసంగాలు, ప్రతిజ్ఞ, జాతీయ గీతాలాపన ద్వారా దేశంపై తమ ప్రేమను చాటారు. భారత జాతీయ పతాకాన్ని గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని, జాతీయ పతాకం మన ఐక్యత, సమైక్యత, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక అని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యతాయుత పౌరసత్వాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇన్‌చార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జ్ సందీప్, ఉపాధ్యాయినీ-ఉపాధ్యాయులు, విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీ చార్జి దురదృష్టకరం: ఆర్‌జేసీ కృష్ణ

**ఖమ్మం విద్యా విభాగం జూలై 22, ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీకేజీ కి నిరసనగా న్యూఢిల్లీ లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీ చార్జి దురదృష్ట కరమని ఆర్ జె సి విద్యాసంస్థల అధినేత, బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థులు తమ సమస్యలను ప్రశాంతంగా తెలియజేసుకొనే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. లాఠీ చార్జి చేయడం, టియర్ గ్యాస్ వంటివి ప్రయోగించడం వంటి చర్యలు సరికాదని అన్నారు .చనిపోయిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందజేయాలని డిమాండ్ చేశారు.

# ప్రతి విద్యాసంస్థలోని యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలి...

## - అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణు గోపాల్

## - రాష్ట్ర స్థాయికి ప్రతిభావంతులను ఎంపిక చేయాలి

కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 22 ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్( రెవెన్యూ) సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘం (డిస్ట్రిక్ట్ అడ్వైజరీ కమిటీ ఆన్ యూత్ ప్రోగ్రామ్స్) సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షి ంచి మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా యువతకు వివిధ రంగాల్లో అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 9 వేల మంది యువత ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ప్రత్యేక నమోదు కార్యక్రమం ద్వారా ఈ సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. జిల్లాలోని ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్ని విద్యాసంస్థలను సందర్శించి ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. అలాగే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో యూత్ పార్లమెంట్ నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయికి పంపాలని, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన




యువతకు భారత పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో నిర్వహించే క్విజ్ పోటీల్లో విజేతలకు దేశ సరిహద్దు రాష్ట్రాల పర్యటన అవకాశం లభిస్తుందని, కొన్ని కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రధాన మంత్రిని కలిసే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాలపై యువతలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం, తదితర ఎనిమిది రకాల పోటీలను జిల్లాలో నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో విజేతలకు కేంద్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ వెంకట్రామ్ బాబు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి , జిల్లా షెడ్యూల్డ్ తరగతుల అభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా ఇంటర్మీడి యేట్ విద్యాధికారి వెంకటేశ్వర్లరావు , జిల్లా విద్యాధికారి వసంత, జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి డా. కామేశ్వర రావు, అడిషనల్ డిఎంహెచ్ఓ., సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## - నగర పాలికలో ప్రతి బుధవారం ప్రజావాణి నిర్వహణ

## - కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్

కొత్తగూడెం టౌన్, జూలై 22 ప్రభాతవార్త:

నగర ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కొత్తగూడెం నగరపాలక సంస్థలో ఇకపై ప్రతి బుధవారం ‘ప్రజావాణి’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేయర్ మూడ్ గణేష్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన తొలి ప్రజావాణి కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నగరంలో మంచినీరు, వీధిదీపాలు, పారిశుద్ధం వంటి సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలోనే స్పందించాలని సూచించారు. చిన్నచిన్న సమస్యలు నేరుగా కమిషనర్, మేయర్ స్థాయికి రాకుండా సంబంధిత శాఖ అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచనల మేరకు ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి ప్రతి ఫిర్యాదును త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ పరిధిలో పనిచేసే అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించరాదని, క్షేత్రస్థాయి సిబ్బందిపై సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. జటిలమైన సమస్యలు మినహా మిగిలిన ఫిర్యాదులు పైస్థాయికి చేరకుండా సంబంధిత అధికారులు పరిష్కరించాలని,




నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నగరపాలక సంస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ కమిషనర్ సుజాత మాట్లాడుతూ... మేయర్ సూచనల మేరకు పటిష్ట కార్యాచరణ రూపొందించి ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

### - 26 పిటిషన్లు స్వీకరణ...

తొలి ప్రజావాణిలో మొత్తం 26 పిటిషన్లు అందాయి. వాటిలో పారిశుద్ధ్యానికి సంబంధించి 6, టౌన్ ప్లానింగ్ 5, ఇంజినీరింగ్ విభాగం 5, ఇంటి పన్నులు 4, చేయూత పెన్షన్లు 4, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన 2 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్, మేనేజర్లు సత్యనారాయణ, ప్రసాద్, ఆర్ఓ రవీందర్, టీపీఓ నవీన్, డీఈ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహాన్, డీఎంసీ రాజేష్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీఛార్జ్, రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ నిరసన

కొత్తగూడెం టౌన్, జూలై 22 ప్రభాతవార్త: ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం బస్టాండ్ కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ



సందర్భంగా ఎన్ఎస్‌యూఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి, ప్రతి విద్యార్థికి తమ అభిప్రాయాన్ని శాంతియుతంగా వ్యక్తపరిచే రాజ్యాంగబద్ధమైన హక్కు ఉందని అన్నారు. ఆ హక్కును అణచివేసే విధంగా ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేసిన రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆరోపించారు. కొత్తగూడెంలో నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడాన్ని కూడా ఆయన ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే ప్రయత్నాలను ఎన్ఎస్‌యూఐ వ్యతిరేకిస్తుందని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగబద్ధమైన మార్గంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తలారి మధు, ఉర్సు శివ, బానోత్ శ్రీధర్, షేక్ సమీర్, కాటి సందీప్, ఎస్.కె. నయన్, ఉబ్బలపల్లి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

## - జిల్లా సమన్వయకర్త సతీష్

ఆళ్లపల్లి 22 జూలై ప్రభాతవార్త: మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల నందు 108 అంబులెన్స్ ను జిల్లా సమన్వయకర్త సతీష్ బుధవారం తనిఖీ చేశారు. 108 వాహనంలో తీసుకువెళ్లే రోగికి వ్యాధిని బట్టి పరికరాలు ఉన్నాయా లేవని పరిశీలించారు. బీపి ఆపరేటర్, స్టెతస్కోప్, గ్లూకోమీటర్ ,థర్మ మీటర్, పురుగుల మందు సేవించిన వారికి చికిత్స కోసం సెక్షన్ ఆపరేటర్, గుండెపోటు బాధ్యతలకు ఏ ఈ డి పరికరం ఆక్సిజన్ రోడ్డు ప్రమాద బాధితులకు లేవలేని స్థితిలో ఉన్న వారికి స్ట్రక్చర్స్ , స్కూప్ స్ట్రక్చర్స్ ,స్పెయిన్ బోర్డ్ వీల్ చైర్ ,పరికరాలను పరిశీలించారు. వ్యాధులను బట్టి 108 వాహనంలో వచ్చినటువంటి రోగికి వైద్యశాలకు చేరే అంతవరకు సిబ్బంది ప్రాథమిక చికిత్స అందిస్తారని జిపిఎస్ అధునాతన సాంకేతికతో అంబులెన్స్ లోనే ట్యాబ్ సైతం అందుబాటులో ఉన్నదని అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్లో రూట్ మ్యాప్ ద్వారా10 15 నిమిషాలలో రోగి దగ్గరికి చేరేలా అవకాశం ఉన్నదని జిల్లా వ్యాప్తంగా 108 అంబులెన్స్ వాహనాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని మండలంలో 24 గంటలు ఎప్పుడు అందుబాటులో ఉండేలా 108 సిబ్బంది మెరుగైన సలహాలు సూచనలు అవగాహనలు తెలియజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబులెన్స్ సిబ్బంది పైలెట్ సునీల్ కుమార్ ఆకాష్ శ్రీహరి ఇఎంటి భాగ్యమ్మ జిల్లా వాహన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# రేపు ఫుడ్ లైసెన్స్ మేళా

## - జిల్లా ఆహార భద్రత అధికారి ఈ. శరత్

కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 22 ప్రభాతవార్త:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడీఓసీ ఆవరణలో ఫుడ్ లైసెన్స్ మేళా నిర్వహించబడుతుందని జిల్లా జిల్లా ఆహార భద్రత అధికారి ఈ. శరత్ ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని ఆహార వ్యాపారులు, హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, బేకరీలు, కిరాణా దుకాణాలు, పాలు, పాల ఉత్పత్తుల వ్యాపారులు, ఇతర ఆహార వ్యాపార సంస్థల యజమానులు ఈ మేళాకు హాజరై కొత్త ఫుడ్ లైసెన్స్/రిజిస్ట్రేషన్, లైసెన్స్ పునరుద్ధరణ (రెన్యువల్), సవరణలు (మోడిఫికేషన్) తదితర సేవలను పొందవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఆహార వ్యాపారులకు ప్రత్యేకంగా తెలియజేయునది ఏమనగా, ఎట్టి పరిస్థితుల్లోనూ “తత్కాల్ ఫుడ్ లైసెన్స్“ కోసం దరఖాస్తు చేయవద్దు మరియు “తత్కాల్ లైసెన్స్“ పేరుతో ఎవరికి అదనపు రుసుములు చెల్లించవద్దు. ఫుడ్ లైసెన్స్ పొందేందుకు సాధారణ విధానమే సరిపోతుంది. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ఫుడ్ లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకొని ఎలాంటి మధ్యవర్తులు లేకుండా అధికారిక విధానంలోనే సేవలు పొందవలసిందిగా కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని ఆహార వ్యాపారులందరూ ఈ ఫుడ్ లైసెన్స్ మేళాకు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా విజ్ఞప్తి చేసారు.

# గిరిజన హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదాం

## - టిజిఎస్ గౌరవ అధ్యక్షులు కల్లూరి వెంకటేశ్వరరావు

## - 13 మందితో టిజిఎస్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

కొత్తగూడెం టౌన్, జూలై 22 ప్రభాతవార్త:

గిరిజనుల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో ఐక్యంగా రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) గౌరవ అధ్యక్షులు కల్లూరి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ స్పష్టం చేశారు. పాల్వంచ పట్టణంలోని సిపిఐ కార్యాలయం ‘సిఆర్ భవన్’లో బుధవారం తెలంగాణ గిరిజన సమాఖ్య నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇటీవల పాల్వంచలోని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో జరిగిన తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) రాష్ట్ర మూడో మహాసభల్లో ఎన్నికైన 25మంది కార్యవర్గ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో 13 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుని నూతన కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా కల్లూరి వెంకటేశ్వరరావు (భద్రాద్రి జిల్లా), అధ్యక్షులుగా అజ్మీర రామ్మూర్తి (ఖమ్మం జిల్లా), ప్రధాన కార్యదర్శిగా రమావత్ అంజయ్య నాయక్ (నల్గొండ జిల్లా), ఉపాధ్యక్షులుగా వడిత్య స్వరూపా (మేడ్చెల్ జిల్లా), సొందె కుటుంబరావు (భద్రాద్రి జిల్లా), మూడ్ గణేష్ (కొత్తగూడెం మేయర్), రమావత్ నర్సు (రంగారెడ్డి జిల్లా), సహాయ కార్యదర్శులుగా జువారి రమేష్ (జనగామ జిల్లా), భూక్య శ్రీనివాస్ (భద్రాద్రి జిల్లా), రాజారాం (సూర్యాపేట జిల్లా), వీరు నాయక్ (ఖమ్మం జిల్లా), కోశాధికారిగా నేనావత్ రూప్ సింగ్ (హైదరాబాద్)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాఖ్య రాష్ట్ర మూడో మహాసభలు అత్యంత విజయవంతమయ్యాయని పేర్కొన్నారు.

# టిఆర్ఎస్ లో చేరిన సిపిఎం మండల కమిటీ సభ్యుడు రామకృష్ణ

ఆళ్లపల్లి 22 జూలై ప్రభాతవార్త: గత ఎన్నో ఏళ్లుగా సిపిఎం పార్టీలో మండల కమిటీ సభ్యుడు కె.వి.పి.ఎస్ జిల్లా నాయకుడుగా పనిచేసిన మండల కేంద్రంలో



మర్కోడు గ్రామానికి ముసల రామకృష్ణ బుధవారం హైదరాబాద్ తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో పార్టీలో చేరామని అన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీలో పనిచేస్తానని పార్టీని బలోపేతం చేయడంలో ముందంజ ఉంటానని వారు తెలియజేశారు.

## అమెరికా వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి

### - మోదీ దిష్టిబొమ్మ దహనం చేసి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నిరసన



**ముదిగొండ ప్రభాతవార్త, జూలై 22 :**

అమెరికాతో వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్య ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ముదిగొండలో రెండు సంఘాల ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడితో ప్రధాని నరేంద్ర మోదీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ ఒప్పందాల వల్ల భారత రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పౌల్ట్రీ రంగంతో పాటు ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలు కూడా సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దేశ రైతుల ప్రయోజనాలను పరిరక్షి ంచే దిశగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు సంబంధించిన ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రైతు సంఘం మండల అధ్యక్షుడు మాదినేని రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పొన్నం వెంకటేశ్వరావు, పాపినేని నరసింహారావు, రైతు సంఘం మండల కార్యదర్శి కొలేటి ఉపేందర్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు పయ్యావుల పుల్లయ్య, పుచ్చకాయల లక్ష్మయ్య, నేమిలి సైదులు, ముదిగొండ సర్పంచ్ కట్టకూరు ఉపేందర్, యువజన సంఘం కార్యదర్శి మెట్ల సతీష్, నాయకులు ఇరుకు నాగేశ్వరరావు, మహేష్

## బోనకల్‌లో బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో సమీక్ష సమావేశం

### - ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి: డిప్యూటీ తహసీల్దార్



**బోనకల్, ప్రభాతవార్త :** మండల కేంద్రమైనబోనకల్ గ్రామంలోని పీఎస్ నంబర్లు 113, 114, 115 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించేలా బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని, రాజకీయ పార్టీల బీఎల్‌ఏలు కూడా పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ, గ్రామ పాలన అధికారి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు. సమావేశంలో ఓటరు జాబితా సవరణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి, పాల్గొన్న వారి సందేహాలను డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్ నివృత్తి చేశారు.

## రైల్వే సమస్యలపై కరువైన రైల్వే అధికారుల స్పందన

### - డివిజన్ మారడంతో నైనా మారని మధిర స్టేషన్ పరిస్థితి

### - వినతి పత్రాలన్నీ చెత్తబుట్ట లోకేనా?



**మధిర జూలై 23 ప్రభాతవార్త :**

గడిచిన ఐదేళ్ల కాలంగా అపరిష్కృతంగా ఉన్న రైల్వే ప్రయాణికుల సమస్యలపై రైల్వే శాఖ స్పందన మృగ్యంగా మారింది. సౌత్ సెంట్రల్ రైల్వేలో కొనసాగిన కాలంలో మధిర స్టేషన్ అభివృద్ధికి రైళ్ల రాకపోకల అంశంలో ఇతర సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా ప్రజాప్రతినిధులు ఎన్నో విన్నపాలకు స్పందించి రైల్వే అధికారులను ప్రశ్నించే అవకాశాలు ఉండేవి. అయితే కరోనా కాలంగా ఉన్న సమయంలో అనేక రైళ్లను రైల్వే శాఖ రద్దు చేయడంతో పాటు కొన్ని రైళ్ల రాకపోకలను నియంత్రించింది. రైళ్ల పునరుద్ధరణ జరిగిన తర్వాత కూడా మధిర రైల్వే స్టేషన్లో ఆగిన పద్మావతి సింహపురి గౌతమి రైళ్లతోపాటు ప్యాసింజర్ రైళ్ల అంశంలో ఐదేళ్ల కాలంగా ఈ ప్రాంత ప్రజలు రైల్వే అధికారులకు పార్లమెంటు సభ్యులకు శాసనసభ్యులకు వినతి పత్రాలను అందజేస్తూ పునరుద్ధరించడంతోపాటు కొన్నేళ్లుగా కోరుతున్న విధంగా నవజీవన్ జిటి చార్మినార్ తదితర ట్రైన్లను మధిర స్టేషన్లో ఆపాలని కోరుతూ వస్తున్నారు. ఈ విన్నపాలు పరిపాటిగా మారినప్పటికీ వాటికి సంబంధించి రైల్వే శాఖ అధికారులు స్పందించిన దాఖలాలు లేవంటే ఈ ప్రాంత ప్రజల ప్రయాణికుల విన్నపాలపై రైల్వే శాఖకు ఏ మేరకు నిబద్ధత ఉన్నది అనేది స్పష్టమవుతుంది. అలాగే ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్న పార్లమెంటు సభ్యులు చేసిన విన్నపాలకు కూడా మధిర ప్రాంత ప్రజలకు న్యాయం జరిగిన పరిస్థితులు లేవంటే అతిశయోక్తి కాదేమో. కోట్లాది రూపాయలతో నూతనంగా అభివృద్ధి చేస్తున్న రైల్వే స్టేషన్ కు సంబంధించి విపనంత ప్రజల్లో ప్రయాణికులు ప్రత్యేకించి ఆంధ్ర తెలంగాణ సరిహద్దుగా గలిగిన ముఖ్య పట్టణంగా ఉన్న మధిర మీదుగా అటు చెన్నై విశాఖపట్నం సికింద్రాబాద్ న్యూఢిల్లీ వంటి సుదూర ప్రాంతాలకు విద్యార్థులు ఉద్యోగులు వివిధ హోదాలకు చెందిన ప్రయాణికులు ప్రయాణించే అవకాశం ఉన్నట్లు రైల్వే శాఖ సర్వేలో వెల్లడైనప్పటికీ రైళ్ల రాకపోకలను రైల్వే స్టేషన్ ను ప్రాధాన్యతను గుర్తించి నిలుపుదల చేసేందుకు రైల్వే శాఖ చొరవ చూపకపోవడం జరుగుతూ వస్తూనే ఉంది. కొత్తగా ఏర్పాటు అయిన విశాఖ జోన్ పరిధిలోకి మధిర ఎరుపాలెం రైల్వే స్టేషన్లు వెళ్లడంతో సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో గతంలో ప్రయాణికులు ప్రజాప్రతినిధులు చేసిన విన్నపాల మేరకు కనీసం ప్రతిపాదనల దిశగా అడుగులు వేసిన దరఖాస్తులకు ప్రస్తుతం మోక్షం లభించే పరిస్థితి లేకపోవడం జరుగుతుందని ప్రయాణికులు వాపోతున్నారు.

డిఆర్ఎం లు వస్తున్నారు పోతున్నారు:గడిచిన ఏడేళ్లుగా మధిర కేంద్రంగా రైల్వే ప్రయాణికులు డి ఆర్ ఎం లు గా విధులు నిర్వహిస్తున్న అధికారులు స్టేషన్ తనిఖీల కోసం వస్తున్న ప్పుడల్లా వినతి పత్రాలు ఇవ్వడం వాటిని సదరధికారులు చెత్తబుట్టలో పడేయడం కొనసాగుతూ వస్తోంది. ఇదే క్రమంలో బుధవారం మధిర రైల్వే స్టేషన్లో పెరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షి ంచేందుకు వచ్చిన విజయవాడ డివిజన్ డిఆర్ఎం మోహిత్ సోనిక్య కు కూడా నిలిచిపోయిన రైతులను పునరుద్ధరించాలని కొత్తగా రైళ్ళను నిలుపుదల చేయాలని రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపరచాలని కోరుతూ వినతిపత్రాన్ని సంఘాలు ప్రయాణికుల సంఘం వినతి పత్రాలను అందించడం జరిగింది. అయితే వినతి పత్రాలను తీసుకోవడమే తప్ప వీటిపై స్పష్టమైన హామీని ప్రకటించకపోవడం రైల్వే శాఖ మధిర రైల్వే స్టేషన్ పరిధిలోని ప్రయాణికుల పట్ల చూపుతున్న అలసత్వానికి పరాకాష్టగా చెప్పవచ్చు. ప్రస్తుతం విజయవాడ డివిజన్ పరిధిలోకి మిళితమైన మధిర ఎరుపాలెం రైల్వే స్టేషన్లు విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా ఏర్పడిన రైల్వే జోన్ పరిధిలోకి వెళ్లడంతో ప్రజాప్రతినిధులు విన్నపాలు కూడా వినే పరిస్థితి లేదనేది సుస్పష్టం. ప్రస్తుతం మధిర మీదుగా ఈ స్టేషన్లో నిలుపుదల చేస్తున్న, నడుస్తున్న రైళ్లలో ఎక్కువ శాతం సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ జోన్ పరిధిలో నిర్దేశించి కొనసాగుతున్నవి కావడం గమనించాల్సిన విషయం. కొత్తగా ఏర్పడిన రైల్వే జోన్ పరిధిలోకి మదిర స్టేషన్ విలీనం అయిన క్రమంలో అనేక ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు మధిర వరకు పొడిగించడం లేదా స్టేషన్లో హాల్టింగ్ సౌకర్యాలను కల్పించే అవకాశాలు విస్మృతం అవుతాయన్న ప్రయాణికులు ఆశలు అడియాశలుగానే మారనున్నాయా అనేది సమాధానం లేని ప్రశ్నగా మారింది.




## రూ.1 లక్ష ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

**మధిర జూలై 23 ప్రభాతవార్త :** మృతి చెందిన రైతు కుటుంబానికి లక్ష



రూపాయల ఇన్సూరెన్స్ చెక్కును సొసైటీ చైర్మన్ కటికల సీతారాంరెడ్డి బుధవారం అందజేశారు. మండల పరిధిలోని సిద్ధినేనిగూడెం సొసైటీ లో సభ్యులుగా ఉన్న ఒబ్బిరెడ్డి శ్రీనివాసరెడ్డి మరణించగా నామినీ గా ఉన్నటువంటి వారి సతీమణి అంజమ్మకు ఇన్సూరెన్సు ఒక లక్ష రూపాయలు అమౌంట్ ను డీసీసీబీ మధిర బ్యాంకు లో మేనేజర్ వెంకటేశ్వర్లు సిద్ధినేనిగూడెం సొసైటీ చైర్మన్ కటికల సీతారామిరెడ్డి చేతులు మీదగా అందిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ గోపిరెడ్డి సొసైటీసెక్రటరీ కృష్ణారెడ్డి బ్రాంచి సిబ్బంది పాల్గొన్నారు.

## సెంట్రల్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా నాణ్యమైన ఆహారం

### - ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ ఏఎంసీ చైర్మన్

**మధిర జూలై 23 ప్రభాతవార్త:**

మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రీకృత కమ్యూనిటీ కిచెన్ ద్వారా జిల్లా పరిధిలోని 50 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందుతుందని ఏఎంసీ చైర్మన్ బండారి నరసింహారావు మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ ఇజ్రాయిల్ పాల్ అన్నారు. మధిర మార్కెట్ యార్డ్ లో ఏర్పాటుచేసిన కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కిచెన్‌లో జరుగుతున్న వంట ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, ఆహార తయారీలో పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత, ఆహార భద్రత చర్యల గురించి హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు వండిన ఆహారాన్ని ఎలా రవాణా చేస్తున్నారో, సమయానికి విద్యార్థులకు చేరే విధంగా అనుసరిస్తున్న పంపిణీ వ్యవస్థ, వంటశాలలో పాటిస్తున్న పారిశుద్ధ్య ప్రమాణాలు, వ్యర్థాల నిర్వహణ పరిశుభ్రమైన వంటశాల నిర్వహణ, ఆహార భద్రతకు తీసుకుంటున్న చర్యలపై హెచ్‌కేఎం అధికారులు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ బండారు నరసింహారావు ఈ కేంద్రీకృత కమ్యూనిటీ కిచెన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారం సమయానికి అందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా మధిర పరిసర ప్రాంతాల్లోని సుమారు 50,000 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం/ఆహార పంపిణీ చేయనున్నట్లు అధికారులు వివరించారని చెప్పారు. అలాగే అత్యాధునిక వంట సౌకర్యాలు, శాస్త్రీయ పద్ధతిలో ఆహార తయారీ, పరిశుభ్రమైన ప్యాకింగ్, వేగవంతమైన రవాణా వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఈ కిచెన్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ అధికారులు, మార్కెట్ కమిటీ అధికారులుసిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజల భద్రతకు పెద్దపీట..

**- గరీబ్‌పేట పంచాయతీలో ముమ్మరంగా వీధిలైట్ల ఏర్పాటు**

**కొత్తగూడెం టౌన్, జూలై 22 ప్రభాతవార్త:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం గరీబ్‌పేట గ్రామపంచాయతీలో సర్పంచ్ పూనెం దివ్యతేజ ఉపేందర్ ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో రాత్రివేళ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వీధిలైట్ల ఏర్పాటు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తూనే, ప్రజల భద్రత కోసం వీధిలైట్లు ఏర్పాటుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. గత రెండు రోజులుగా పంచాయతీ పరిధిలోని గరీబ్‌పేట, లక్ష్మీ మ్మపురం తండా, అంబేద్కర్ కాలనీ ప్రాంతాల్లో కొత్త వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీ అభివృద్ధి కోసం విద్యావంతులైన సర్పంచ్





దంపతులు నిరంతరం కృషి చేస్తుండటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు సమస్యలు తెలియజేసిన వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపడుతున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు. గ్రామాభివృద్ధి, పారిశుద్ధం, మౌలిక వసతుల కల్పనలో గరీబ్‌పేట గ్రామపంచాయతీ ఆదర్శంగా నిలుస్తోందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

# ఢిల్లీలో జరిగిన పరిణామాలకు ఆజ్యం పోస్తున్న కాంగ్రెస్

**- రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీజేపీ శ్రేణులు**

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**

**కొత్తగూడెం టౌన్, జూలై 22 ప్రభాతవార్త:**

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలకు మరింత ఆజ్యం పోస్తూ అల్లరి మూకలను రెచ్చగొడుతున్న కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ చర్యలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ శ్రేణులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. బుధవారం బీజేపీ జాతీయ పార్టీ పిలుపుమేరకు జరిగిన ఈ కార్యక్రమం లో అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో గల అమరవీరుల స్తూపం వద్ద దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి మాట్లాడుతూ... "ఢిల్లీలో జరిగిన పరిణామాల నేపథ్యంలో దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులకు రాహుల్ గాంధీ మద్దతు ఇస్తున్నారని తాము భావిస్తున్నామన్నారు. దేశంలో అల్లర్లు, ఉద్రిక్త పరిస్థితులు సృష్టించడం కాంగ్రెస్ పార్టీకి కొత్త విషయం కాదని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని వ్యాఖ్యానించారు."ఈ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను



గౌరవించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే పార్లమెంట్‌లో, చట్టసభల్లో చర్చించి ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. నిరసనల పేరుతో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించడం ఏమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు.అలాగే, "భారతీయ జనతా పార్టీ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ ప్రజాస్వామ్యబద్ధంగా దేశానికి సేవ చేస్తోందని వివరించారు. దేశ సమైక్యత, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని" స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో పంటల మార్పిడితో రైతులు ఆదాయం పెంచుకోవాలి

**- జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు**

**లక్ష్మీదేవిపల్లి, జూలై 22 ప్రభాతవార్త:**

ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సూచించారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి దీపక్‌తో కలిసి నిర్వహించిన రైతుల అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ... బోరు నీటిపై ఆధారపడి వరి సాగు చేయడం వల్ల నీటి కొరత ఏర్పడి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ఆయిల్ పామ్, అపరాలు (పప్పుధాన్యాలు), కూరగాయలు, మొక్కజొన్న, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం లభిస్తుందని, అపరాలు, మొక్కజొన్న, జొన్న వంటి పంటలు తక్కువ నీటితో సాగవడంతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ కలిగి ఉన్నాయని తెలిపారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో




పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా తగ్గించుకోవచ్చన్నారు. ఎల్ నినో పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సూచనలు అందిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపక్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఏకలవ్య పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**

**కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 22 ప్రభాతవార్త:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో (ఈఎంఆర్ఎస్) విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవలు, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కమిటీ (డీఎల్సీ) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో టేకులపల్లి, ములకలపల్లి, దుమ్ముగూడెం, గుండుగులపల్లి, గుండాల, చర్ల, పాల్వంచ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ, విద్యా ప్రమాణాల మెరుగుదల, తాగునీటి సౌకర్యం, క్రీడా మైదానాలు, డిజిటల్ సదుపాయాలు తదితర అంశాలపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏకలవ్య పాఠశాలల్లో విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలు, వార్షిక ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షల శిబిరాలు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక హెల్త్ స్క్రీనింగ్ క్యాలెండర్ రూపొందించి, దాని ప్రకారం పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఏకలవ్య పాఠశాలల్లో పార్ట్ టైం డాక్టర్ ను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా జిల్లాలోని అన్ని ఏకలవ్య పాఠశాలల్లో ఆర్ఓ సిస్టమ్‌తో కూడిన వాటర్ కూలర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దుమ్ముగూడెం, చర్ల ఏకలవ్య పాఠశాలలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి కనెక్షన్ కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. గుండుగులపల్లి ఏకలవ్య పాఠశాలలో అంతర్గత



సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని, పనులు చేపట్టేలా ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. పాఠశాల విస్తరణకు అవసరమైన అదనపు భూమి అంశాన్ని కూడా సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ ఆర్ సి ఓ అరుణకుమారి, భద్రాచలం పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్, అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ పాఠశాల ప్రిన్సిపల్, ఏకలవ్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్

# కాంగ్రెస్ నేతల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

**- దేశంలో నియంత పాలన సాగుతోంది**

**కొత్తగూడెం, జూలై 22 ప్రభాతవార్త:**



ప్రధాని మోదీ నివాసం వద్ద నిరసన తెలిపిన నరాహుల్గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ అరెస్టు తీవ్రంగా ఖండిస్తున్నామని, హైదరాబాద్ రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తోపాటు ఇతర క్యాబినెట్ మంత్రులను అరెస్టు చేయడం అన్యాయం అని డిసిసి ప్రెసిడెంట్ తోట దేవి ప్రసన్న, రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి అన్నారు. కాంగ్రెస్ నేతల అక్రమ అరెస్టులను నిరసిస్తూ బుధవారం కొత్తగూడెం పట్టణం బస్టాండ్ కూడలిలోని అమరవీరుల స్తూపం వద్ద కాంగ్రెస్ నేతలు నల్ల కండువాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. "ప్రతిపక్షపార్టీ నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమే. నీట్ పరీక్షపత్రం లీకేజీతో దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైంది అని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగిన నవిద్యార్థులు, యువ తపట్లపోలీసులు విచక్షణా రహితంగా వ్యవహరిస్తూ లాఠీఛార్జ్ చేయడం అత్యంత తదుర్మార్గం. మోదీ హయాంలో దేశంలో అరాచ కపాల నకొనసాగుతోంది. కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిరసనను అడ్డుకున్నారు. దీనితో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగాసీతారాములు, కాంగ్రెస్ రాష్ట్ర ప్రముఖ నాయకులు కోనేరు సత్యనారాయణ, కొత్వాల శ్రీనివాస్ రావు, మండే వీర హనుమంతరావు, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు వై.శ్రీనివాస్ రెడ్డి, పెద్దబాబు, కొడుమూరి శ్రీనివాస్ రావు, జానీ పాషా, లోకొట్టి నాగార్జున, రాజేంద్ర ప్రసాద్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీ యు ఆర్ ఎస్ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి

**ఖమ్మం అర్బన్, జులై 22(ప్రభాతవార్త):**

టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఖమ్మం అర్బన్ మండలం వెలుగు మెట్ల కేజీబీవీ,యు ఆర్ ఎస్ ఉపాధ్యాయులతో రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు జిల్లా ట్రెజరర్ వల్లం కొండ రాంబాబు పాల్గొన్నారని ఖమ్మం అర్బన్ మండల ప్రధాన కార్యదర్శి బియ్యని కృష్ణయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ... కేజీబీవీ మరియు యు ఆర్ ఎస్ ఉపాధ్యాయుల కు పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని శ్రమ దోపిడీ జరుగుతుందని,ఇచ్చే అరకొర వేతనం నెలలో ఎప్పుడు వస్తుందో తెలియదని అన్నారు.శ్రమకు తగ్గ టైం స్కేల్ ఇవ్వాలని రెగ్యులర్ చేయాలని రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా సెలవుల్ని ఇవ్వాలని కోరుతూ కేర్ టేకర్ ని నియమించాలని అన్నారు.గత సంవత్సరం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఇచ్చిన మాట ప్రకారం 29 రోజుల సమ్మె కాలానికి జీతం మంజూరు చేయాలని,ఉపాధ్యాయులను బోధనకి పరిమితం చేయాలని,



ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, పిఆర్సి ఇవ్వాలని జీరో వన్ జీరో పద్ధతి ద్వారా జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ మండలం ప్రధాన కార్యదర్శి బియ్యని కృష్ణయ్య కార్యదర్శి విదిత రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు జిల్లా ట్రెజరర్ వల్ల రాంబాబు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలి...

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..
- వచ్చే జూన్ వరకు త్రాగునీటికి సరిపడా నీటి వినియోగంపై కార్యాచరణ సిద్ధం..
- రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను తిరిగి ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం కొనసాగుతోంది..
- వరి, మిర్చికి బదులుగా ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి..
- రూ.175 లక్షల యూఐడీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన..
- వి.వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాలను పరిశీలించిన మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**రఘునాథపాలెం ప్రభాతవార్త జూన్ 22:**





త్రాగునీటిని కాపాడుకుంటూ, రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కలిసి వి. వెంకటాయ పాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా రైతులు ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు వంటి తక్కువ నీటిఅవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ 2026 నుంచే అధికారులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు వరి సాగుపై పట్టుబడితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు.1977లో వచ్చిన కరువు కంటే ప్రస్తుతం వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న సూపర్ ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమై ఉండే అవకాశముందని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దీని ప్రభావం పెరిగి భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని, త్రాగునీటి పరిరక్షణపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఖమ్మం జిల్లాకు కృష్ణా జలాలు మాత్రమే సరిపోవని, దశాబ్దాలుగా గోదావరి జలాలను తీసుకురావాలనే ప్రజల ఆకాంక్ష ఉందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి శ్రీరాముడి పేరుతో ఖిసీతారామఖి ప్రాజెక్టుగా నామకరణం చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు జిల్లాకు అందుతున్నాయని చెప్పారు.ఇంజినీర్ల సూచనల మేరకు వైరాకు తరలించిన గోదావరి నీటిని రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం జరుగుతోందన్నారు. మంచుకొండతో పాటు ఇతర ఎత్తిపోతల వ్యవస్థల ద్వారా చెరువులు నింపి, మంచుకొండ ఓవర్‌ఫ్లోను మున్నేరులోకి మళ్లించడం ద్వారా ఖమ్మం నగర త్రాగునీటి అవసరాలను తీర్చేప్రయత్నం చేస్తున్నామని వివరించారు. అవసరమైతే డీప్‌కట్ నుంచి మంచుకొండకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించే అత్యవసర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఏర్పడిందని, ఇది సాగునీటి రంగంలో విశేష విజయమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక సూచనలు అందించి విజయవంతంగా పూర్తి చేసిన ఇంజినీర్లను ప్రత్యేకంగా అభినందించారు.పశ్చిమాసియా యుద్ధాల ప్రభావంతో బొగ్గు, గ్యాస్ కొరత ఏర్పడి విద్యుత్ సరఫరా, యూరియా ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రైతులకు పారదర్శకంగా యూరియా అందించేందుకు ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఇది పూర్తిగా రైతుల సంక్షేమం కోసమేనని చెప్పారు. రాజకీయ ప్రేరేపణలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.వీబీజీఆర్ఏఎం నిధులను వినియోగించి ఎన్ఎస్‌పీ కాలువల్లో పెరిగిన పొదలను తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు మంత్రి సూచించారు. ఖమ్మం నగరంలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని, విద్యుత్ స్తంభాల సమీపంలో మొక్కలు నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత చాలా తక్కువగా ఉందని, రాబోయే నెలల్లో వర్షాలు కురవకపోతే త్రాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశముందని అన్నారు. అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ వచ్చే జూన్ 2027 వరకు త్రాగునీటి అవసరాలు తీరేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు.ఇప్పటి వరకు గోదావరి జలాలను వైరాకు తరలించామని, ప్రస్తుతం రాజీవ్ కాలువ షట్టర్లను మూసివేసి గోదావరి నీటిని తిరిగి ఖమ్మం వైపు మళ్లించి పాలేరు రిజర్వాయర్ ను నింపే అవకాశాలను ఇంజినీర్లు, నిపుణులు పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ ప్రక్రియను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.ఈ ప్రయోగం ద్వారా త్రాగునీటి సమస్యను అధిగమించగలమనే విశ్వాసం ఉందన్నారు. అయితే వర్షాలు లేకుంటే వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు కష్టసాధ్యమవుతుందని హెచ్చరించారు. నీరు కనిపిస్తున్నదని నిరక్ష ్యం చేయకుండా అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.అనంతరం మంత్రి ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.175 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సిఇ ఇరిగేషన్ శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డిపిఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) లో అర్హత ఉన్న ప్రతి ఓటరు నమోదయ్యేలా చర్యలు..

- జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్.
- వంద శాతం డిజిటలైజేషన్ కోసం ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలి.
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై సమీక్షి ంచిన జిల్లా కలెక్టర్

**ప్రభాతవార్త కలెక్టరేట్ జూలై 22:**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటర్ డ్రాఫ్ట్ ల్లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తో కలిసి ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షి ంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా బిఎల్వోలు ఆగస్టు 3 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు మూడు నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి ఆగస్టు 10న ముసాయిదా ఓటర్ జాబితాలో ప్రచురిస్తామని తెలిపారు. ఆగస్టు 10 నుండి సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్స్ ఎకరాలు స్వీకరించి, అక్టోబర్ 8 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 12న శృతి ఓటర్ జాబితాను ప్రచురిస్తామని తెలియజేశారు. జిల్లాల మొత్తం 1460 పోలింగ్ స్టేషన్లను, 12, 43,781 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 10,15,693 మంది ఓటర్ల వివరాలలో డిజిటలైజేషన్ చేశామని తెలిపారు. ఇది 81.66 శాతం పురోగదికి సమానమని, ఇంకా 2,28,088 మంది ఓటర్ల వివరాలు డిజిటలైజేషన్ పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సక్రమంగా జరగని వారి వివరాల పై ఎన్నికల అధికారులకు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. నోటీసులకు నిర్దేశిత సమయంలో స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరును తుది ఎస్ ఐ ఆర్ ఓటరు జాబితాలో చేర్చుతామని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో 12 రకాల ధ్రువీకరణ పత్రాలను ఆధారంగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన పత్రాల కోసం ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖల ద్వారా వెంటనే జారీ చేసే లా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ తుది ఓటర్ జాబితాలో స్థానం కల్పించటమే ప్రభుత్వ లక్ష ్యమని స్పష్టం చేశారు. డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి కావాలంటే ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సహకరించాలని కోరారు. బి ఎల్ వో లు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ప్రజల నుంచి తిరిగి సేకరించేందుకు సహకరించాలని, ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలు అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వీలైనంత ఎక్కువమంది ఓటర్లు మ్యాపింగ్ పూర్తి అయ్యేలా అందరు కృషి చేయాలని, తక్కువ సంఖ్యలో మాత్రమే మ్యాపింగ్ కానీ ఓటర్లు మిగిలితే వారికి అవసరమైన పత్రాలు సేకరించి తుది జాబితాలో చేర్చడం సులభవు తుందని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్ డి సి సదానందం, ఆర్డీవో శ్రీనివాస్, ఎన్నికల విభాగ సూపర్డెంట్ ఎంఏ రాజు, డిటి అన్సారి, అధికారులు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నం గోపాలరావు, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు మంకెన రమేష్, కే వెంకటరావు ఆన్ ఆమ్ ఆద్మీ. పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు పి ఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ(ఎం) పార్టీ ప్రతినిధి నెల్లూరు వీరబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ నిరంకుశత్వానికి రాహుల్ గాంధీ అరెస్టే నిదర్శనం

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు**

**అశ్వాపురం,ప్రభాతవార్త, జూలై 22:**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిరంకుశత్వానికి రాహుల్ గాంధీ అరెస్టే నిదర్శనమని అశ్వాపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు అన్నారు.అశ్వాపురం మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచన మేరకు అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు మాట్లాడుతూ, పోటీ పరీక్షల పేపర్ లీకేజీలతో దేశంలోని లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు.వారి తరఫున ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అదుపులోకి తీసుకోవడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర



విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అరెస్టులు, అక్రమ కేసులతో కాంగ్రెస్ శ్రేణులను భయపెట్టలేరని, విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల సాధన కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు జిమ్మా ఝాన్సీ,ఎనిక ఉషారాణి,కాలివేటి సరిత, మచ్చ నరసింహారావు, కుంజ జాను,కోర్స కృష్ణ, సబ్కా పిచ్చయ్య,ఎట్టి నరేష్,ఉపసర్పంచ్ దరావత్ హర్ష నాయక్, మేకల అంజిబాబు,తెల్లం వీరభద్రం,ఆవుల రవి, తూము పెద్ద వీర రాఘవులు,బచ్చు వెంకటరమణ,కొండబత్తుల ఉపేందర్,సామకూరి వెంకన్న,గాదె వెంకటరెడ్డి,బారజు సంపత్,మట్టా వీరభద్రా రెడ్డి,ఎనిక రవి,జిమ్మా జంపయ్య,గొల్లపల్లి నరేష్, వేముల విజయ్, తాటి రాంబాబు,గొడ్ల నాగేశ్వరావు, మధు , ఉపేందర్,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ నిరసన

**- రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన నేతలు**

**పినపాక, ప్రభాతవార్త, జూలై 22:**

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగాకాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఏడోళ్ల బయ్యారం ఎక్స్ రోడ్లో బుధవారం భారీ నిరసన,ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ దేశ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా వరుస పరీక్ష పేపర్ ల లీకేజీల కారణంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని,నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతోందని విమర్శించారు.పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదైన కేసులు ఆయన అరెస్టు రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని ఆరోపిస్తూ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే



విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు.ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని, విద్యార్థులు, నిరుద్యోగులు,రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు అన్నారు.కార్యక్రమంలో దిశా కమిటీ అధ్యక్షులు మద్దెల సమ్మయ్య,ఎస్సీ సెల్ నాయకులు ప్రసాద్,సర్పంచులు అలివేలు,స్వప్న, అనిత,వెంకటేశ్వర్లు,బాబురావు, చందర్రావు,ఉప సర్పంచ్ లు సందీప్, శిరీష,రామ్మోహన్, నవీన్,అచ్చ నవీన్, కాంగ్రెస సీనియర్ నాయకులు కంది సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి,లక్ష్మారెడ్డి, హేమంత్,చందర్ రావు మహిళా విభాగ ప్రతినిధులు,యువజన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు పాటించకపోతే కఠిన చర్యలు

**- అశ్వాపురం సిఐ సిహెచ్.ఎల్లయ్య**

**- పాఠశాల, కళాశాలల బస్సులు తనిఖీ**

**ఆశ్వాపురం,ప్రభాతవార్త, జులై 22:**

అశ్వాపురం మండల కేంద్రంలో బుధవారం స్కూల్,కాలేజీలకు చెందిన వాహనాలను అశ్వాపురం సీఐ సిహెచ్ ఎల్లయ్య ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. విద్యార్థుల భద్రతే లక్ష ్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.వాహనాల ఫిట్‌నెస్,బీమా,ఆర్‌సీ, పర్మిట్, కాలుష్య నియంత్రణ (పీయూసీ) సర్టిఫికెట్లు,ఫస్ట్ ఎయిడ్ బాక్స్,ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్,స్పీడ్ గవర్నర్, తదితర భద్రతా ప్రమాణాలను పరిశీలించారు.డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్‌లు,వారి అర్హతలను కూడా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థుల




ప్రాణాలతో నిరక్ష ్యంగా వ్యవహరించవద్దని, వాహనాల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించకూడదని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డ్రైవర్లకు విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక లారీల వల్ల నేతాజీ గ్రౌండ్ అస్తవ్యస్తం

**మణుగూరు, ప్రభాతవార్త, జూలై 22:**

మణుగూరు పట్టణంలోని ఓల్డ్ సీఎస్పీ వద్దగల నేతాజీ సుభాష్ చంద్రబోస్ క్రీడా మైదానంలో ఇసుక లారీలు నిలపడం వల్ల గ్రౌండ్ అస్తవ్యస్తంగా తయారైందని స్థానిక క్రీడాకారులు, వాకర్స్ క్లబ్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు లారీలను అడ్డుకొని నిరసన తెలిపారు. మణుగూరులోని శివాజీనగర్, కొమ్ముగూడెం, గుండ్ల సింగారం, అన్నారం ఇసుక ర్యాంపుల నుండి వచ్చే లారీలకు ఈ మైదానాన్ని యార్డులా ఉపయోగించడంతో గుంతలు పడి గ్రౌండ్ పాడైందని, అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ వాకింగ్ చేసేవారికి, ఆర్మీ, సెంట్రల్ ఫోర్స్ శిక్షణ పొందే నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. మైదానాన్ని






పాడుచేసిన్నందుకు బాధ్యులైన ఇసుక రీచ్ కాంట్రాక్టర్లు, లారీ యజమానులపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, వాకర్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# సింగరేణి మెడికల్ బోర్డును మళ్లీ నిర్వహించాలి

**- ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్**

**మణుగూరు, ప్రభాతవార్త, జూలై 22:**



సింగరేణిలో ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డును వెంటనే రద్దు చేసి, బాధితులందరికీ న్యాయం జరిగేలా మళ్లీ నిర్వహించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ ) మణుగూరు ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ పిలుపుమేరకు మణుగూరులోని అన్ని మైన్స్, డిపార్ట్‌మెంట్ల వద్ద ఉన్నతాధికారులకు మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ఈ నెల 18న జరిగిన మెడికల్ బోర్డులో 120 మంది కార్మికులను పిలిచి, కేవలం 24 మందిని మాత్రమే అన్ఫిట్ చేయడం అన్యాయమన్నారు. విచారకరమైన విషయమేమిటంటే మరో 28 మంది కార్మికులకు తమను బోర్డుకు పిలిచారనే సమాచారం కూడా అందలేదని పేర్కొన్నారు. దశాబ్దాలుగా చీకటి గనుల్లో పనిచేస్తూ కాళ్ల నొప్పులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న కార్మికులను వైద్యులు పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 2,000 మందికి పైగా కార్మికులు మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని, యాజమాన్యం స్పందించి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పునఃపరిశీలన జరిపి అర్హులైన వారందరినీ అన్ఫిట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి. పుల్లారావు, ఆవుల నాగరాజు, శనగరపు కుమారస్వామి, జి. శ్రీనివాసరావు, ఈసం శ్రీనివాసరావు, బి. రవికుమార్, ఎం. పద్మావతి, సుదీప్, డీ వీ రావు, అబ్రహం, జానకి ప్రసాద్, దండు విజయ్, ఉడుత శివ, శేఖర్ బాబు, నాగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్యానికి విఘాతం

**- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు, ప్రభాతవార్త, జూలై 22:**



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఢిల్లీలో నిరసన కార్యక్రమం సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని, ఇతర కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అత్యంత దురదృష్టకరం అని అన్నారు. ప్రజల గొంతును అణిచివేసే ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకే తీవ్ర విఘాతం అని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ, విభిన్న అభిప్రాయాలను గౌరవించాలని ఆయన కోరారు. తక్షణమే రాహుల్ గాంధీతో పాటు అరెస్ట్ చేసిన నాయకులందరినీ విడుదల చేసి, రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవించాలని పాయం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.రాజకీయ విభేదాలను అణచివేత ధోరణితో కాకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కోవాలని సూచించారు.

# కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష చేపట్టాలి: ఏఐటీయూసీ

**- అనారోగ్య కార్మికులకు న్యాయం చేయాలి**

**- మెడికల్ బోర్డును మళ్లీ నిర్వహించాలని వినతిపత్రాలు**

**ఇల్లందు అర్బన్, జూలై 22, ప్రభాతవార్త:** ఈ నెల 17, 18 తేదీల్లో



నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలను పునఃసమీక్షించి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఇల్లందు ఏరియాలోని కేఓసీ, జేకేఓసీ5, ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్, ఎస్ పీసీ, ఏరియా సివిల్ విభాగాల వద్ద పెద్ద ఎత్తున కార్మికులు నిరసన కార్యక్రమాలు, ధర్నాలు నిర్వహించి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను ఆయా గని అధికారులకు అందజేశారు. ఏరియా వర్క్‌షాప్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి వ్యాప్తంగా సుమారు 2,000 మంది కార్మికులు ఏళ్ల తరబడి మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, కేవలం 120 మందికే బోర్డు నిర్వహించడం అన్యాయమని అన్నారు. అలాగే, మెడికల్ బోర్డుకు ఎంపికైన వారిలో 28 మంది కార్మికులకు సకాలంలో సమాచారం అందకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. హాజరైన 120 మందిలో కేవలం 24 మందిని మాత్రమే ఇన్వాలిడేషన్‌కు అర్హులుగా ప్రకటించడం గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డులతో పోలిస్తే చాలా తక్కువ శాతమని పేర్కొన్నారు. బొగ్గు గనుల్లో, ముఖ్యంగా అండర్‌గ్రౌండ్‌లో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులు కీళ్ల నొప్పులు, వెన్నెముక సమస్యలు, శ్వాసకోశ



వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, వారి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిగణనలోకి తీసుకోకుండా ఫలితాలు ప్రకటించడం వల్ల నిజంగా అర్హులైన కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికులందరికీ తక్షణమే మరోసారి కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహించాలని, ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని నిష్పాక్షికంగా పరిశీలించి అర్హులైన వారిని ఇన్వాలిడేషన్‌కు ఎంపిక చేసి, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించడం ద్వారా కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శులు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, వి. జయరాజు, జక్కుల శ్రీనివాస్, దాట్ల వెంకటేశ్వర్లు, పి. యుగేందర్, మంగపతి రావు, కలవల సిద్ధార్థ్, విజయ్ శ్రీనివాస్, గుగులోత్ కృష్ణ, చెరుకు సారయ్య, రావుజీ, బట్టు రవి, కొంటు వీరస్వామి, అమ్మ ఆంజనేయులు, గుగులోత్ లక్ష్మణ్, నందకుమార్, ఆర్.ఎల్., విష్ణువర్ధన్, నిఖిల్ కుమార్ సాహూ, నగేష్, మహేష్, సోలం వెంకటేశ్వర్లు, మేఘరాజు, స్వరూప, గుగులోత్ సోని, లక్ష్మీ, సంధ్యారాణి, సింధు తదితరులు పాల్గొన్నారు.



# భూ సర్వే కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

**- నిర్ణీత గడువులో సర్వే పనులను పూర్తి చేయాలి**

**- సీతారామ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసర్వే పనుల పరిశీలన**

**- నరసాపురం గిరిజన బాలికోన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ**

**- జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మిక పర్యటన**

**జూలూరుపాడు, ప్రభాతవార్త, జూలై 22:**

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూ సేకరణ సర్వే పనుల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం మండలంలో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. మండల పరిధిలో జరుగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూ సేకరణ సర్వే పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పురోగతిపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, సర్వేలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జూలూరుపాడులో మొత్తం 17 ఎకరాల 20 కుంటల భూమికి సర్వే చేపట్టాల్సి ఉందని, అందులో సుమారు 8 ఎకరాలు ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూములు ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కొత్తూరు గ్రామంలో కొనసాగుతున్న భూ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్, మొత్తం 337 ఎకరాల భూమికి సర్వే చేపట్టాల్సి ఉందని తెలుసుకుని, పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూ సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రతి దశను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. సర్వేకు అవసరమైన మార్కింగ్ పనులను ఒక రోజులో పూర్తి చేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వెడల్పును 50 మీటర్ల నుంచి 40 మీటర్లకు తగ్గించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్రాజెక్టు డిజైన్‌ను సాంకేతికంగా పరిశీలించి



నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం పడమట నరసాపురం గ్రామంలోని గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల, విద్యార్థుల వసతి గదులు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉంచిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, కిచెన్ షెడ్‌లో పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ఉదయం అల్పాహారం, మెనూ ప్రకారం భోజనం అందుతున్న విధానం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో పదో తరగతి ఫలితాలు వంద శాతం నమోదయ్యాయని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని బాధ్యతగా తీసుకుని, లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ అధికారులు, సర్వే అధికారులు, రైతులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఇల్లందు, గుండాల, టేకులపల్లి

# ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం మానుకోవాలి

- ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ అరెస్ట్‌కు నిరసనగా కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో

- మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్

**మణుగూరు, ప్రభాతవార్త, జూలై 22:**



నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మద్దతు తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ మణుగూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు భారీ రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు కూరం రవిల సంయుక్త అధ్యక్షతన ఈ నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. విద్యార్థుల వైపు నిలబడిన నాయకులను అరెస్ట్ చేయడం నిరంకుశత్వానికి నిదర్శనమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు సూరపురెడ్డి తరుణ్ రెడ్డి, ఎన్ఎస్ యూఐ కార్యదర్శి ఆరిఫ్ పాషా, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి రహీం భాష, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు పొడుతూరి రవి, సర్పంచ్‌లు కలబోయినా మాధవరావు, పూనెం రమేష్, మడకం రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్లెలమడుగులో తొలిముద్ద కార్యక్రమం

**అశ్వాపురం, ప్రభాతవార్త, జులై 22:** మల్లెలమడుగు అంగన్ వాడి కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి తొలిముద్ద కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ సర్పంచ్ మచ్చా నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు పోషకాలతో కూడిన బ్రేక్ ఫాస్ట్ ను అంగన్వాడి కేంద్రాల్లో అందించడం జరుగుతుందని, ప్రజా ప్రభుత్వంలో అంగన్వాడి కేంద్రాల్లో చదివే పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని లక్ష్యంతో తొలిముద్ద కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ యొక్క అల్పాహారంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని వారు తెలిపారు తల్లిదండ్రులు పిల్లలను విధిగా అంగనవాడి కేంద్రాలకు పంపించాలన్నారు. అనంతరం పిల్లలకు సర్పంచ్ చేతుల మీదుగా యూనిఫామ్ అందించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రెడ్డి అరుణ, ఆశ వర్కర్ సుశీల, గర్భిణీలు, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.



# విద్యతో పాటు నైపుణ్యాలు అత్యంత అవసరం

**అశ్వారావుపేట రూరల్, జూలై 22 ప్రభాతవార్త:**

ప్రస్తుత తరుణంలో యువతకు విద్యతో పాటు నైపుణ్యాలు అత్యంత అవసరమని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో ఐటిడిఎభద్రాచలం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన శిక్షణ కేంద్రాన్ని ఐటీడీఏ పిఓ రాహుల్‌తో కలిసి ఎమ్మెల్యే జారె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి కాలంలో కేవలం విద్య ఒక్కటే సరిపోదని, విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వం గిరిజన



యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, దీని ద్వారా వందలాది మంది యువతీ యువకులు తమ జీవితాలను తీర్చిదిద్దుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఐటిడిఎ పిఓ రాహుల్ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అత్యంత ముఖ్యమైనవని అన్నారు. యువజన శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకుడికి శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో అవసరమైన మౌలిక వసతులు, శిక్షణా సామగ్రి, నిపుణుల ద్వారా బోధన వంటి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. శిక్షణ అనంతరం యువత ఉద్యోగ అవకాశాలను పొందేలా ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ సంస్థలతో అనుసంధానం చేసే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ముఖ్యంగా యువతులు ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడేందుకు కుట్టు మిషన్, బ్యూటీషియన్ వంటి కోర్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, లక్ష్మీనారాయణ, మండల అధికారులు, ఐటీడీఏ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**అశ్వారావుపేట అర్బన్, జూలై 22 ప్రభాతవార్త:**

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతీ లబ్ధిదారుడికి అందేలా చూడాలని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి





పనులు, వాటి పురోగతిపై శాఖల వారీగా ఆరా తీశారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఐదు మండలాల అధికారులు పాల్గొన్నారు.

## ..వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయండి



**తల్లాడ జులై 22: ప్రభాతవార్త**

వాతావరణ పరిస్థితుల కను గుణంగా రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా పశుసంవర్ధన శాఖ సంచాలకులు డాక్టర్ బోడెపుడి పురంధర్ విజ్ఞప్తి చేశారు బుధవారం రైతు వేదికలు ప్రజాప్రతినిధులు మండల అధికారులు కార్యదర్శుల కు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కనుగుణంగా అవసరమయ్యే పంటలను మాత్రమే ప్రత్యామ్నాయ పంటలుగా రైతులు ఎంచుకొని సాగు చేయాలని ఎల్ ని నో ప్రభావంతో సాగునీరు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు ప్రత్యామ్నాయ పంటలైన అపరాలు మిల్లెట్స్ సాగు చేయాలన్నారు ప్రత్యామ్నాయ పంటలు నేపథ్యంలో తాగునీటి సాగునీరు సంరక్షణ తోపాటు పశుగ్రాసం పై దృష్టి సారించాలన్నారు ఈ మేరకు గ్రామాల్లో గ్రామసభలు రైతు సమావేశాలు కరపత్రాలు మైకులు ద్వారా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండి తాజుద్దీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో అంబటి శ్రీధర్ రాజు ఏఈలు అరుణ నవ్య రాయల ప్రసాద్ కృష్ణ కాంత్ శాఖ వైద్యులు డాక్టర్ రాజు ఎంపీ ఓ ఆర్ హరికృష్ణ ఏ పి ఓ సిహెచ్ కోటయ్య సర్పంచులు సుధారాణి బి కాళోజి శ్రీదేవి రాధాకృష్ణయ్య తల్లాడ ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

## ..అమ్మవారికి శాకంబరి అలంకరణ..

**తల్లాడ జులై 22 :ప్రభాతవార్త**



ఆషాడ మాసం ఎనిమిదో రోజు అమ్మవారికి శాకంబరి అలంకరణ ఘనంగా నిర్వహించారు కూరగాయలతో అందంగా తల్లాడకు చెందిన సముద్రాల లక్ష్మీపతిరావు పండరీలు ఏర్పాటు చేశారు ఆలయ కమిటీ చైర్మన్ లగడపాటి నెహ్రూ మాధవిలు పర్యవేక్షించారు

## కేటీఆర్ ని కలిసిన తల్లాడ సర్పంచ్ తనయుడు

**తల్లాడ జులై 22 :ప్రభాతవార్త**



టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు తనయుడు అయ్యప్ప కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు బుధవారం కేటీఆర్ ఇంటికి వెళ్లి ముందుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపి తన అభిమానం చాటుకున్నారు

## రైతులు ఆరుతడి పంటలే వేసుకోవాలి..



**కొణిజర్ల జూలై 22ప్రభాత వార్త:**

ఎల్నినో కారణంగా రైతులందరూ ముందస్తు అవగాహనతో ఆరుతడి పంటలే వేసుకోవాలని ఏడిఏ కరుణ శ్రీ, తాసిల్దార్ అరుణ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉపేంద్రయ అధ్యక్షతన. పలు శాఖలో ఉన్నతాధికారులు అధికారులతో జరిగిన సమీక్ష సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ..ఎల్నినో ప్రభావంతో ఈ సంవత్సరం తీవ్ర వర్షాబావ పరిస్థితులదృష్ట్యా , పంటలు పండే అవకాశం లేనందున .. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలు వేసుకోవాలని, ఎవరికి వారు తమ పొలాల్లో నీటి పంట కుంటలు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాలు పెరిగేలా చూసుకోవాలని, అధికారులు గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు 2 గ్రామ సభలు 8 డిపార్ట్మెంట్స్ మండల స్థాయి అధికారుల ద్వారా ఏర్పాటు చేసి రైతులకు ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు దిశా నిర్దేశం చేసినారు . కార్యక్రమంలో వ బాలాజి , ,ఐబి ఇంజనీర్, వెటర్నరీ డాక్టర్స్, విద్యుత్ , నీటిపారుదల శాఖల అధికారులు, ఏపీఓ అమ్మజాన్ , ఏఎస్ఓ , ఏఈ ఓస్ , అధికారులు, సిబ్బంది హాజరైనారు.




## తడి, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువు తయారీ



**దమ్మపేట రూరల్ జూలై 22 ప్రభాతవార్త**

:దమ్మపేట గ్రామ పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డులో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుల్లో ఏర్పాటు చేసిన గదుల్లో వేస్తూ వ్యర్థాలను వృథా చేయకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది సేంద్రియ ఎరువు తయరీ పనితీరును సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, కార్యదర్శి బండి అనంత్ కుమార్, వార్డు సభ్యులు పరిశీలించారు. రసాయనిక ఎరువులతో మానవ మనుగడకు ముప్పు ఉందని గ్రహించిన రైతులు సేంద్రియ ఎరువుల వాడకానికి మొగ్గు చూపుతున్నారు. డంపింగ్ యార్డుల్లో స్వచ్ఛమైన ఎరువు తయారీ చేస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, చాట్ల శ్రీనివాసరావు, బత్తుల సాయి, పసుమర్తి కుసుమాంబ, దాసరోజు రామారావు, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, పూనెం పోలమ్మ, పంచాయతీ సిబ్బంది బసవయ్య, మహాదేవ సాయి, పారిశుధ్య సిబ్బంది, పగడాల గోపి తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**దమ్మపేట, జూలై 22 ప్రభాతవార్త:**



మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరి కాబడిన సిఎంఆరఎఫ్ చెక్కులను అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పంపిణీ చేశారు. మండల కేంద్రం దమ్మపేటతో పాటు లింగాలపల్లి గ్రామంలో పలువురు అనారోగ్య బాధితులకు మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు తన చేతుల మీదుగా ఎమ్మెల్యే అందజేశారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సాయంతో పాటు నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సంక్షేమ సహాయం త్వరితగతిన అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజల ఆరోగ్య భద్రతకు, అత్యవసర వైద్య పరిస్థితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఊరట కలిగిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన బాధ్యత అని తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, గ్రామ ప్రజలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నూతన తహశీల్దార్

**దమ్మపేట, జూలై 22 ప్రభాతవార్త:**



మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మద్దినేని మురళి బుధవారం ఎమ్మెల్యే జారే ఆ ది నా రా య ం ణ న ం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో గండుగులపల్లి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రజలకు పారదర్శక రెవెన్యూ సేవలు అందించడంపై చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులతో సమన్వయంతో ముందడుగు వేయాలని సూచించారు.




# రాహుల్ గాంధీపై పోలీసు చర్య ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

వైరా జూలై 22 (ప్రభాతవార్త)

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును వినియోగిస్తున్న ప్రతిపక్ష నాయకులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఢిల్లీలో జరిగిన పోలీసు చర్యను నిరసిస్తూ వైరాలో కాంగ్రెస్ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో చేపట్టారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల సమస్యలు, పరీక్షల పారదర్శకత, నిరుద్యోగ యువత ఆవేదన





వంటి కీలక అంశాలపై సమాధానం కోరడం ప్రతిపక్ష బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీపై పోలీసు చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించే పరిణామమని అన్నారు. . ఈ సమాధానం కోరిన వారిపై కేసులు, అరెస్టులు, అణచివేత చర్యలు చేపట్టడం సమస్యలకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు. దేశ యువత, విద్యార్థుల భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, దాస్ నాయక్ స్పష్టం చేశారు. ఈ నిరసనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, విద్యార్థి నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీపై జరిగిన పోలీసు చర్యను ఖండించారు.

# నాణ్యత లోపించిన భవన నిర్మాణం స్వల్ప కాలంలోనే దెబ్బతిన్న స్లాబు

### ఊడి పడుతున్న గోడల పెచ్చులు భయాందోళనలో విద్యార్థులు ఉపాధ్యాయులు

కారేపల్లి జూలై 22 (ప్రభాతవార్త)

భావిభారత పౌరులైన విద్యార్థుల ప్రయోజనాన్ని ఆశించి కార్పొరేట్ స్థాయికి దీటుగా పాఠశాల భవనాల నిర్మాణం కోసం కోట్లాది రూపాయలు ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు అయ్యాయి. అయితే సంబంధిత కాంట్రాక్టర్ పూర్తిచేసిన భవన నిర్మాణం లోప భూయిష్టంగా ఉండడంతో పాటు నాణ్యత లోపించిన విధంగా నిర్మాణం పూర్తయిన 13 సంవత్సరాలకే స్లాబ్ పెచ్చులు ఊడి పడుతూ దినదిన గండంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో పాఠశాల విద్యార్థులు



సిబ్బంది భయాందోళన మధ్య కొనసాగుతున్న తీరుకు నిదర్శనం కారేపల్లి ఆదర్శ పాఠశాల. సింగరేణి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ భవనం ప్రస్తుతం ప్రమాదకర స్థితికి చేరుకుంది. నేడు ఈ పాఠశాలలో సుమారు 700 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. .పాఠశాల ప్రిన్సిపాల్ గదిలో సైతం సంవత్సర కాలంగా స్లాబు పెచ్చులు ఊడి ఇనుప రాడ్స్ కనబడుతున్నాయి. నిర్మాణం ఎంత దారుణంగా ఉందో స్పష్టం చేస్తోంది. 13 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ మోడల్ స్కూల్ భవనం నిర్మాణ నాణ్యతపై తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. బయటకు చూస్తే భవనం ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ, లోపల గోడల్లో పగుళ్లు, ఊడిపోతున్న ప్లాస్టర్, బలహీనమైన నిర్మాణం స్పష్టంగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి భవనానికి తక్షణమే సాంకేతిక పరీక్షలు నిర్వహించి, అవసరమైన మరమత్తులు చేయుటకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రిన్సిపల్ ఎలియట్ ప్రేమ్ కుమార్ వివరణ పాఠశాల భవనముకు పెచ్చులు ఊడి పడుతున్నది వాస్తవమేనని ఈ సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

# వర్షాభావ పరిస్థితుల్లో ఉద్యాన పంటల సాగు మేలు

రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి

కామేపల్లి, జూలై 22 (ప్రభాతవార్త):

వర్షాభావ పరిస్థితులలో రైతులు ఉద్యాన పంటలను సాగు చేయాలని తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.కామేపల్లి రైతు వేదికలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు అవగా హన కార్యక్రమంలో గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున సరైన సమయంలో వర్షాలు పడకపోవడం కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు అయినా పప్పు దినుసులు అపరాలు, కూరగాయలు పండిం



చాలని కోరారు.అనంతరం రైతులకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా సరఫరా చేసిన కూరగాయల విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు.సాగులో మెలకువలను వివరించారు.వైరా డివిజన్ ఉద్యాన అధికారి డాక్టర్ ఆకుల వేణు రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎల్నినో ప్రభావాన్ని వివరిస్తూ కూర గాయల సాగు,ఇతర ఉద్యాన పంటల సాగు ఉత్తమమని తెలిపారు.ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న రాయితీ వివరాలను రైతులకు వివరించారు.ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయ అధికారి బి. తారా దేవి,విస్తరణ అధికారులు బానోత్ జగదీష్, దీపక్ రెడ్డి, శ్రీకాంత్, లింగాల మాజీ ఎంపీటీసీ రామ్ రెడ్డి జగన్నాథ్ రెడ్డి, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్,రైతులు అజ్మీర రాందాస్ నాయక్, అజ్మీర అర్జున్ నాయక్, ఉప సర్పంచ్ అజ్మీర నాగమణి, భూక్య సీతారాములు, భూక్య లక్ష్మణ్ నాయక్, జరుపల గణేష్ నాయక్, జోగ్గూడెం పంచాయతీ కార్యదర్శి వత్సవాయి రవికుమార్, జ్యోతి, జరుపల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# వైరా రిజర్వాయర్ నుంచి పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయాలి

వైరా టౌన్ జూలై 22 (ప్రభాతవార్త)

వైరా రిజర్వాయర్ నుంచి సాగునీటిని తక్షణమే పూర్తిస్థాయిలో విడుదల చేయాలని పలువురు సర్పంచులు జిల్లా వ్యవసాయ అధికారి దాసరి పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల కింద ఉన్న ఆయకట్టు ప్రాంతాల్లో 99 శాతం వరి పంటపైనే ఆధారపడి రైతులు జీవనోపాధి కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత సాగు సీజన్‌లో రైతులను ఆదుకునేందుకు వెంటనే కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని కోరారు. గోదావరి జలాలు రిజర్వాయర్‌కు చేరుకోవడం, రిజర్వాయర్‌లో నీటిమట్టం ఆశాజనకంగా ఉండటంతో ఆయకట్టు రైతుల్లో పంటలపై ఆశలు చిగురించాయని తెలిపారు. అయితే ప్రస్తుత సాగునీటి విడుదల ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్ రెడ్డి, జవ్వాజి అశ్విని, శెట్టిపల్లి శ్రీనివాసరావు, మేడూరి రామారావు, బాలాజీ కృష్ణారావు, మేడ హేమియ చక్రపాణి, ఆళ్ల వెంకటరావు పాల్గొన్నారు.

**కేసుపల్లి ర్షాలు కురవాలని గ్రామ దేవతలకు..జలాభిషేకం.**

ఏన్కూరు, జూలై 22, ప్రభాత వార్త

:వర్షాలు సకాలంలో కురవాలని వేడుకుంటూ.. కేసు పల్లి గ్రామంలో మైసమ్మ..గ్రామదేవతలకు భక్తులు..మహిళలు..ప్రత్యేక పూజలు.. జలాభి షేకాలు నిర్వహించారు. విస్తారంగా వర్షాలు కురవాలని..పంటలు సమృద్ధిగా పండా లని.. పిల్లాపాపలతో సుఖంగాఉండాలని.. నీటి బిందెలను ఊరేగింపుగా గుంపులుగా గ్రామదేవ తల వద్దకు చేరుకున్నారు. మైసమ్మ.. ముత్యా లమ్మ.. పోతురాజు.. బొడ్రాయి వంటి గ్రామదే వతల విగ్రహాలకు నీటితో జలాభిషేకం చేసి.. కొబ్బరికాయలు ప్రత్యేక పూజలు చేశారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం అప్రజాస్వామ్యం

ఏన్కూరు, జులై 22, ప్రభాత వార్త

:ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ చార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకు లు అన్నారు. ఏన్కూరు ప్రధాన సెంటర్ నందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని పోలీసులు అదుపులో తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ..ఆయని వెంటనే వి డుదల చేయాలని డిమాండ్ చేశారు. .ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగ బద్ధమైన హక్కు ఉందని..ఆ హక్కును అణిచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోతు లచ్చిరాం నాయక్, కొప్పుల ప్రభావతి రెడ్డి,సామేలు, వేముల కృష్ణ ప్రసాద్, నవీన్, మదన్, మేడా ధర్మారావు నిమ్మల నాగేశ్వర రావు, మొగిలి నాగరాజు, ముక్తి వెంకటేశ్వర్లు,వాసిరెడ్డి నాగేశ్వర రావు, మాలోతు నరసింహారా వు,తాళ్లూరి నవీన్,నల్లమల శివకుమార్,పూర్ల కంటి మైసవరావు,శివ శంకర్ మజీద్ ఖాన్,గు ర్రం రవి, భూక్యా చందూ లాల్ నాయక్,సాగర్, వంతగాని నరేష్,నక్క నాయక్, పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టుపై కాంగ్రెస్ నిరసన

కారేపల్లి,జులై 22 (ప్రభాతవార్త)

ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు సంఘీభావంగా నిలిచిన లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు చేయడం రాజ్యాంగ స్ఫూర్తిపైనా, ప్రజాస్వామ్య హక్కులపైనా దాడేనని కాంగ్రెస్ నేతలు అన్నారు. రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా బుధవారం కారేపల్లి క్రాస్ రోడ్డులో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు నాయకత్వం లో రోడ్లపై కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు బైఠాయించి నిరసనలు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి,మోదీ డౌన్ డౌన్అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు పెద్ద బోయిన ఉమా శంకర్ రామ్మూర్తి నాయక్ అడ్డగోడ ఐలయ్య,విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ మనియార్, ఈసాల ఛాయాదేవి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్,మేదరి టోనీ,హనుమంతు, ఆంగోత్ మత్రు,మోతి వీరస్వామి,దండు ప్రవీణ్, హేమలత బాలాజీ,ధరావత్ వెంకటేశ్వర్లు,ఎల్లయ్య తదితర సర్పంచులు, ఎండి యాకుబ్ అలీ,గోపాల్ నాయక్,అనీఫ్,తాజుద్దీన్,భీముడు, మజీద్ పాషా,షఫీ,నరేన్,ఆదెర్ల రాములు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ నిర్మాణ పనులను సమీక్షించిన డి ఈ

కారేపల్లి జూలై 22 (ప్రభాతవార్త)



సింగరేణి మండలం మాదారం గ్రామంలో వర్షపు నీరు నిలుస్తున్న డ్రైనేజీ ప్రాంతంలో నూతనంగా 19 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ డి ఈ కరుణాకర్ రెడ్డి ఏఈ రాజశేఖర్ పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణ పనుల విషయమై మాజీ సర్పంచ్ అజ్మీర్ నరేష్ నాయక్ తో పాటు గ్రామస్తులతో సమీక్షించారు. కొద్ది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా రహదారి ప్రక్కన ఉన్న డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో వర్షాకాలం వచ్చిందంటే మూడు అడుగులకు పైగా వరద నీరు రహదారిపైనే నిలుస్తుంది. దీంతో సమీప కుటుంబాల ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. ఇటీవల డిప్యూటీ సీఈవో మాదారం పర్యటనకు విచ్చేసి పరిస్థితిని సమీక్షించి ఇచ్చిన నివేదికతో 19 లక్షల రూపాయలు డ్రైనేజీ పనులకు మంజూరయ్యాయి. త్వరితగతిన డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కిలారి వెంకటేశ్వర్లు కాసాని లక్ష్మి నారాయ ఇరావుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ, ప్రియాంక అరెస్టులకు నిరసనగా భారీ ర్యాలీ...

- సత్తుపల్లిలో కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు విద్యార్థులు...
- ర్యాలీలో అగ్రభాగాన ఎమ్మెల్యే దంపతులు..
- విద్యార్థులపై పోలీస్ లాటి దెబ్బలకి కన్నీటి పర్యంతమైన ఎమ్మెల్యే...

సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త :






దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాలు లీకేజీ పై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మంగళవారం శాంతియుతంగా విద్యార్థినీ విద్యార్థులతో ధర్నా చేస్తున్న లోక్సభలో ప్రతిపక్ష నేత ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ, పలువురు కాంగ్రెస్ నేతలను విచక్షణ రైతంగా పోలీసులు లాఠీ చార్జీలు ఉపయోగించే అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ ఎఐసిసి, టీపీసీసీ పిలుపుమేరకు నియోజకవర్గ కేంద్రమైన సత్తుపల్లి లో ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు విద్యార్థిని విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి పట్టణ వీధుల్లో మోడీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సత్తుపల్లి జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు హాజరు కాగా ర్యాలీకి అగ్ర భాగాన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ నిలవగా కాంగ్రెస్ జెండాలు చేత పట్టి బిజెపి డౌన్ డౌన్ నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని, తదితరు నినాదాలతో ప్రధాన రహదారి గుండా వెళ్లి ప్రధాన రింగ్ సెంటర్ వద్ద జరిగిన సమావేశంలో ఢిల్లీలో విద్యార్థిని విద్యార్థులపై, జరిగిన లాటి చార్జీని చూసి ఎమ్మెల్యే కన్నీటిపర్వంతమయ్యారు. యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని విద్యార్థులు తమ హక్కులు కోసం విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం శాంతియుతంగా గొంతు ఎత్తటం ప్రజాస్వామ్య హాక్కునిసమస్యలను ప్రశ్నించేవారినిఅణచివేయటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని కేంద్ర ప్రభుత్వం తీరుపై ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద ఇరుసుకు పడ్డారు. సోనం వాంగ్సుక్ చేపట్టిన ఉద్యమం యువత సేపడుతున్న పోరాటాలు దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడే ఉద్యమాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్ట దయానంద విజయకుమార్ అన్నారు. ప్రజల సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ విద్యార్థులు యువతకు అండగా నిలుస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ల పై జరిగిన అప్రజాస్వామిక చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షి ంచేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ప్రజల పక్షాన నిలుస్తుందని డాక్టర్ దయానంద్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రింగ్ సెంటర్ వద్ద దేశ ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ పున్నం సత్యనారాయణకు ఎమ్మెల్యే దంపతుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ ,వైస్ చైర్ పర్సన్, మహమ్మద్ రెహనా కమల్ పాషా, బొంతు సుమలత వేణు, ఏంసూరు మండల పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్రెడ్డి,సత్తుపల్లిమండల, పట్టణ, అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, గాదె చెన్నారావు, కౌన్సిలర్లు తోట సుజలా రాణి, ఇరువాడ అపర్ణ నాగభూషణం, మట్ట దేవజ్యోతి, గ్రాండ్ మోలాలి, బండారు శరత్చంద్ర, పలువురు కౌన్సిలర్ తో పాటు కాంగ్రెస్ నాయకులు చల్లగుండ్ల నరసింహారావు, మహమ్మద్ కమల్ పాషా, పింగళి శామ్యూల్, ఐదు మండలాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ,విద్యార్థిని విద్యార్థులు వేలాదిగా హాజరైనారు.

# సర్ 2026 ఎన్నికల సంఘం అధికారిక కార్యక్రమం..

- ఇది ఏ రాజకీయ పార్టీ సొంత కార్యక్రమం కాదు..
- సర్ హెల్ప్ డెస్క్‌ను ప్రజలు వినియోగించుకోండి....
- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరు...




సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త:

భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన సర్2026 ప్రత్యేక ఓటర్ జాబితాకార్యక్రమం రాజ్యాంగబద్ధమైన, ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధికారిక ప్రక్రియ అని, ఇది ఏ రాజకీయ పార్టీ సొంత కార్యక్రమం కాదని రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వర రావు స్పష్టం చేశారు. బుధవారం ఆయన పత్రికలకు వివరిస్తూప్రజలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కునువినియోగించుకునేలా చేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ సత్తుపల్లి ఆధ్వర్యంలో సర్2026 హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా కొత్త ఓటరు నమోదు, ఓటరు జాబితాలో పేరు పరిశీలన, పేరు లేదా చిరునామా మార్పు, తప్పుల సవరణ, అవసరమైన దరఖాస్తు ఫారాలు నింపడం, సంబంధిత పత్రాలపై మార్గదర్శకత్వం వంటి సేవలను పూర్తిగా ఉచితంగాఅందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలను నంబూరి తీవ్రంగా ఖండించారు. సర్2026 కేవలం బీజేపీ కార్యక్రమమని, దీని వల్ల బీజేపీకి మాత్రమే లాభం జరుగుతుందని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన అధికారిక కార్యక్రమానికి రాజకీయ రంగు పులమడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేననిఅన్నారు. స్వచ్ఛమైన, పారదర్శకమైన, తప్పులు లేని ఓటరు జాబితా ఉండటం ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత అవసరమని, అది అన్ని రాజకీయ పార్టీలకూ, ప్రతి పౌరుడికీ సమానంగా ఉపయోగపడే ప్రక్రియ అని తెలిపారు. ప్రజల్లో అపోహలు సృష్టించే బదులు, ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకొని అవసరమైన సవరణలు చేసుకునేలా అన్నిరాజకీయ పార్టీలు సహకరించాలని సూచించారు. ప్రజలందరూ ఎలాంటి అపోహలకు లోనుకాకుండా సమీపంలోని సర్2026 హెల్ప్ డెస్క్‌ను సందర్శించి, తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైతే సవరణలు చేసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని నంబూరివిజ్ఞప్తిచేశారు. పట్టణ అధ్యక్షుడు భానోత్ విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బి ఎల్ ఏ 1 పాల నాగ సురేందర్ రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జోనల్ గడ్డ నరేష్ జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివ యాదవ్ మైనారిటీ నాయకుడు ఎస్. కె రహమతుల్లా పట్టణ పట్టణ ప్రధాన కార్యదర్శి నూతల కంటి నాగమోనిక, ప్రముఖదంత వైద్యులు డాక్టర్ నూతల కంటిపెద్దిరాజు, వీరబాబు మెరుగు శేషగిరిరావు పాల్గొన్నారు.

# హాస్పిటల్ లో చీకటి రఘుపతిమ్మని పరామర్శించిన మంత్రి తుమ్మల..

సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త :



రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి రాజకీయ ప్రస్థానంలో కీలక వ్యక్తిగా మండలంలోని తుంబూరు గ్రామానికి చెందిన స్వర్గీయ చీకటి సీతారామయ్య భార్య రఘుపతిమ్మ సత్తుపల్లి లైఫ్ కేర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల రఘుపతిమ్మని బుధవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని కుటుంబీకులు చీకటి చిట్టి రావు ,చీకటి. రంగారావు లను అడిగితెలుసుకున్నారు. మంత్రి తుమ్మల వెంట పట్టణ ప్రముఖులు ఉన్నారు.




# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి...

- ఎన్ఎంయులో 36 మంది ఆర్టీసీ ఉద్యోగుల చేరిక...
- ఎన్ఎంయు రాష్ట్ర కార్యదర్శి మోలానా...

సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ( ఆర్టీసీ) నీ ప్రభుత్వంలో విలీనం చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి మోలానా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తుపల్లి కళాభార తిలో బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ సత్తుపల్లి డిపో కమిటీ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పై విధంగా అన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రికల్ బస్సులు అధికంగా ఉండటం వలన కొత్తగా ఉద్యోగుల కు రిక్రూట్మెంట్ లేక పోవటం వల్ల ఉన్న ఉద్యోగులపై ఒత్తిడి అధికంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో మహాలక్ష్మి ్మ స్కీమ్ అమల్లోకి వచ్చిన దగ్గర్నుంచి ఉద్యోగులు మానసిక ఒత్తిడి గురవుతున్నారని ఈ సందర్భంగా మోలానా ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల శ్రేయస్ కొరకు నిరంతరం ఉద్యమించే నేషనల్ మజ్దూర్ యూనియన్ను ప్రతి ఒక్కరు ఆదరించాలని ఆయన కోరారు. ఈరోజు సమావేశంలో సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన టీఎంయూ, ఎస్ డబ్ల్యూ ఎఫ్ ,ఐ ఎన్ టి యు సి, ఈ యు, ఇతరయూనియన్లకు సంబంధించిన 36 మంది కార్మికులు స్వచ్ఛందంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ లో చేరటం జరిగిందని వారిని సాదరంగా ఆహ్వానించి సంఘంలో చేర్చుకోవడం జరిగిందని మోలానా ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సత్యం, కేవీస్ పాల్, సీ ఎన్ కృష్ణ ,ఖమ్మం రీజినల్ సెక్రటరీ ఎల్ ఆర్ కె రావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎండి గఫార్, జి బాలస్వామి, పలువురు సంఘ బాధ్యులు హాజరైన వారిలో ఉన్నారు.

# జేవియర్ ప్రభుత్వ కళాశాలలో పెరిగిన విద్యార్థుల చేరికలు....

**సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త:** సత్తుపల్లి జేవియర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు 202627 విద్యా సంత్సరానికి అడ్మిషన్స్ వివిధ గ్రూపులలో 430 మంది కి పైగా విద్యార్థులు చేరటం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాఎన్ గోపి బుధవారం విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ విద్యా సంవత్సరానికి గాను కళాశాలలో వివిధ గ్రూపుల్లో అడ్మిషన్స్ కొరకు చుట్టుపక్కల ప్రాంతాలను నాలుగు క్లస్టర్లుగా విభజించి అధ్యాపకులకు కేటాయించడం జరిగిందని అన్నారు. అలా కేటాయించ బడినటువంటి గ్రామాలకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాల ప్రత్యేకతలను కళాశాలలో ఉన్న గ్రూపులను గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి కళాశాలలో చేరవలసిందిగా కోరడం జరిగింది. ఈ కృషి ఫలితంగా కళాశాలలో ప్రస్తుతం 430కు పైగా విద్యార్థులు చేరడంచాలాసంతోషకరమైనటువంటి విషయమని ఆయన తెలిపారు. ఈ విద్యా సంవత్స రంలో నూతనంగా ప్రవేశపెట్టిన బి ఎఫ్ ఎస్ ఐ కోర్సులో 60 సీట్లు గాను 60 నిండినట్లుఆయనతెలిపారు. అదేవిధంగా ఎంపీసీ గ్రూపులో కూడా 60 సీట్లు నిండినట్లు, కామర్స్ లో 120 సీట్లు నిండినట్లు, బిఏ ఇంగ్లీష్ మీడియం లో 60 సీట్లు నిండినట్లు, ప్రిన్సిపాల్ గోపి తెలియజేశారు. ఈ సందర్భంగా అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొన్న అధ్యాపకులను ఆయన అభినదించారు.



# మోదీ నిరంకుశత్వానికి రాహుల్ గాంధీ అరెస్టే నిదర్శనం

తుంబూరు దయాకర్ రెడ్డి

ప్రభాత వార్త ఖమ్మం రూరల్:

విద్యార్థుల, నిరుద్యోగుల భవిష్యత్తుతో కేంద్రప్రభుత్వం చెలగాటమాడుతుందని మండిపాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాని మోదీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ ఏదులాపురంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనంప్రభాత వార్త ఖమ్మం రూరల్ : పోటీ పరీక్షల లీకేజీలతో దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల, నిరుద్యోగ యువత జీవితాలను నాశనం చేస్తూ, వారి తరఫున ప్రశ్నిస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అక్రమంగా అదుపులోకి తీసుకోవడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణపురం రాంలీలా ఫంక్షన్ హాల్ నుండి ప్రధాన వీధుల గుండా



ప్రదర్శనగా వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... పేపర్ లీకేజీల వల్ల కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుంటే కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేయాలని ఆందోళన చేసిన రాహుల్ గాంధీపై పోలీసులు బలప్రయోగానికి దిగడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ప్రధాని నరేంద్ర మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పట్టుబట్టారు. అరెస్టులకు, అక్రమ కేసులకు కాంగ్రెస్ శ్రేణులు భయపడేది లేదని, విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల సాధన కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిన అనిత వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్



అధ్యక్షుడు బానోత్ కిషోర్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఖమ్మం రూరల్ మండల, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కూసుమంచిలో,,,,

కూసుమంచి, జూలై 22 ( ప్రభాతవార్త ) : కాంగ్రెస్ అగ్రనేత ,పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కూసుమంచి లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని, ప్రతిపక్ష నాయకులపై రాజకీయ కక్షసాధింపు చర్యలను విరమించుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రిని వెంటనే రాజీనామా చేయించాలని, విద్యార్థులకు న్యాయం చేయవల సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కాంగ్రెస్ నాయకు ం, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు




## మృతుల కుటుంబాలకు కందాళ పరామర్శ..



ప్రభాత వార్త ఖమ్మం రూరల్:

ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ముత్తగూడెం గ్రామంలో కాసాని రాములు, మేకల నాగేశ్వరరావు కుటుంబాలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గొల్లగూడెం గ్రామంలో యాట వెంకటమ్మ, మలీదు వెంకట సిద్దయ్య కుటుంబాలను పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆరేంపుల గ్రామంలో మాజీ జడ్పీటీసీ పెరుమాళ్ళపల్లి మోహన్ రావు సతీమణి కళావతి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మేడా రవీందర్, షేక్ సెంట్ మియా కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. నాయుడుపేటలో ఇటీవల మరణించిన అకిటి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించారు. అభయ టౌన్‌షిప్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న సోమనపల్లి మల్లయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, బాధితులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కందాళ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిఆర్ఎస్ నాయకుడు బెల్లం వేణు మున్సిపాలిటీ నాయకులు బానోతు మోహన్ , బానోతు కృష్ణ , బానోతు వీరన్న, వెంపటి ఉపేందర్, ఖమ్మం రూరల్ మండల నాయకులు ముత్యం పెద్ద కృష్ణారావు మట్ట వెంకటేశ్వర్లు, జరుపుల లక్ష్మణ్ నాయక్, భార్గవ్ , కందాల సోషల్ మీడియా ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

# నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం

నేలకొండపల్లి, జూలై 22 ప్రభాతవార్త:

నీట్ పేపర్ లీకేజ్ విషయమై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న లోక్ సభ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష యువ నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యురాలు ప్రియాంక గాంధీ లను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు బుధవారం నేలకొండపల్లి లోని పీఎస్ఆర్ సెంటర్ నందు ధర్నా, రాస్తారోకో ఆందోళన నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను వారు దగ్ధం చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయడం అన్యాయమని, నీట్ పేపర్ లీకేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్, బొడ్డు బొందయ్య, రాయపూడి నవీన్, లక్కం ఏడుకొండలు, మైసా శంకర్, బచ్చల కూరి నాగరాజు, నంబూరి రామారావు, జెర్రిపోతుల సత్యనారాయణ, జెర్రిపోతుల అంజనీ, కొత్తపల్లి సుబ్బయ్య, కోలిక పొంగు సీతారాములు, వివిధ గ్రామాల సర్పంచులు తేజావత్ శివాజీ, రాయపూడి రామారావు, బోయిన వేణు, కొత్తపల్లి త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాయపాలెంలో

తిరుమలాయపాలెం ప్రభాత వార్త జూలై 22

మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట బి ఎస్ పి , బి ఆర్ ఎస్ , ఎమ్ ఎస్ పి , ఎమ్ ఆర్ పి ఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పిఎస్



నాయకులు చింతిరాలనాగభూషణం,మాట్లాడుతూ నీట్.ప్రశ్నాపత్రం లీక్అవటం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కొమ్ము పూలే,మాట్లాడుతూ. పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. బి ఆర్ ఎస్ మండల నాయకులు గుగ్గిళ్ల అశోక్ మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఢిల్లీలో పోలీసులు లాఠీచార్జ్ చేయడం అత్యంత అమానుషమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో నాయకులు గద్దల మన్మధ రావు,చుంచు వెంకటేశ్వర్లు, జినక రమేష్, మహిళా నాయకురాలు జినక కవిత, గంట వెంకయ్య, చిర్ర అనిల్, ప్రభాకర్, లలితసాగర్ పాల్గొన్నారు..

## కందాళ యువసేన సాయం



తిరుమలాయపాలెం ప్రభాత వార్త జూలై 22.

రాజారం గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణాల వలన మరణించిన మెట్టు కాంతమ్మ కుటుంబానికి కందాళ యువసేన మరియు కందాల అభిమానులు బుధవారం కాంతమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం క్రింద ..23,000/వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు బి ఆర్ ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసారు కందాల స్ఫూర్తితో, మేమంతా దాతల సహకా రం తో మరిన్ని సేవ కార్యక్రమాలు చేస్తామని. అన్నారు. ఈ కార్యక్రమం లో సురేందర్ రెడ్డి , కిరణ్ రెడ్డి , వెంకట రెడ్డి , రవీందర్ రెడ్డి వార్డు మెంబర్ వెంకన్న, ఐలయ్య , భరత్ , గణేష్. తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పార్టీలో భారీగా చేరికలు

నేలకొండపల్లి జూలై 22 ప్రభాతవార్త:

అప్పలనర్సింహాపురం, కట్టుకాచారం, రాయిగూడెం గ్రామాల లోని వివిధ పార్టీలకు చెందిన వారు బుధవారం నేలకొండపల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ సమక్షంలో భారీగా బిజెపి పార్టీలో చేరారు. బిజెపి పార్టీలో చేరిన వారందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పి బిజెపి పార్టీలోకి ఆహ్వానించారు. బిజెపి పార్టీలో చేరిన వారిలో వివిధ గ్రామాలకు చెందిన శీలం హరీష్, తుంగం స్వామి, యెన్నబోయిన నర్సింహారావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ బిజెపి పార్టీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు ఆకర్షులై వారందరూ బిజెపి పార్టీలో చేరుతున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో నేలకొండపల్లి మండలంలో బిజెపి పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని ఆయన చెప్పారు. యువత చూపు బీజేపీ వైపు ఉందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన పట్ల ప్రజలు సంతృప్తి గా ఉన్నారని ఆయన చెప్పారు. బిజెపి పార్టీ అధిష్టానం తెలంగాణ రాష్ట్రం పై ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ఎక్కువగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతోనేనని అన్నారు,

## 16 పంచాయతీలు నూరు శాతం డిజిటలైజేషన్

నేలకొండపల్లి, జూలై 22 ప్రభాతవార్త:

నేలకొండపల్లి మండలం లోని 16 గ్రామ పంచాయతీలు సర్ కార్యక్రమంను నూరు శాతం పూర్తి చేసి ఆదర్శంగా నిలిచినట్లు నేలకొండపల్లి మండల తహసీల్దార్ పి.రాంప్రసాద్ తెలిపారు. బుధవారం మండలం లోని వివిధ గ్రామాలలో సర్ కార్యక్రమం తీరును పరిశీలించారు. సర్ ప్రక్రియలో మండలంను జిల్లాలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన పంచాయతీ లలో కూడ నూరు శాతం పూర్తి చేయాలని బీఎల్వో లకు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం నాటికి 94.13 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలోనే మండలం ప్రథమ స్థానంలో నిలిపేలా శర వేగంగా పూర్తి చేస్తున్న బీఎల్ వో లకు అందుకు సహకరిస్తున్న బీఎల్ ఏ లకు కృతజ్ఞతలు తెలిపారు. .బీఎల్ వో లు విధిగా యూనిఫామ్, టోపి తప్పకుండా ధరించాలని సూచించారు. నూరు శాతం పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవిన్యూ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ సుందర్ సింగ్, ఆయా జీపీవోలు, పంచాయతీ కార్యదర్శి లు, బీఎల్ వో లు, బీఎల్ ఏలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగే మేలు..

కూసుమంచి, జూలై 22( ప్రభాతవార్త )

: మండలంలోని రైతులంతా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపే మక్కువ చూపాలని మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి సూచించారు. రైతువేదికలో బుధవారం ఎల్నినో ప్రభావం ,వర్షాభావ పరిస్థితులు, వాటి వల్ల వ్యవసాయ రంగంపై ఏర్పడే ప్రభావాల పై తదుపరి కార్యాచరణ రూపకల్పన పై మండల స్థాయి సమన్వయ సమావేశంలో వాణి మాట్లాడు తూ రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగు చేయవద్దని , తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఇప్పటికీ కూసుమంచి మండలంలో 53శాతం లోటు వర్షపాతం ఉందని, ఇటువంటి పరిస్థితులలో స్వల్ప కాలిక ప్రత్యా మ్నాయ పంటలు ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించు కోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. రేపటినుండి గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారితో ఖమ్మం అభివృద్ధి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..**

**ఆగస్టు 1 నుంచి ఖమ్మం నగర ట్రాఫిక్‌కు భారీ ఉపశమనం**

**దంసలాపురం, కల్లూరు, సత్తుపల్లి వద్ద ప్రజల కోసం ప్రత్యేక ఎగ్జిట్లు ఏర్పాటు**

**ఖమ్మం-అశ్వారావుపేట నాలుగు లైన్ల జాతీయ రహదారికి కేంద్రం సూత్రప్రాయ ఆమోదం...**

**దంసలాపురం గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ఆర్‌ఓబీ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పూర్తయితే ఖమ్మం జిల్లా అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని, ఆగస్టు 1 నుంచి ఖమ్మం, వైరా, సత్తుపల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి దంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి అసలు ప్రణాళికలో దంసలాపురం వద్ద ఎగ్జిట్ లేకపోయినా, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దంసలాపురం, కల్లూరు, సత్తుపల్లి వద్ద ప్రత్యేక ఎగ్జిట్లు తీసుకొచ్చామని తెలిపారు. దంసలాపురం ఎగ్జిట్ రైల్వే వంతెన ఆధారంగా నిర్మించబడిందన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ రహదారిపై వాహనాల రాకపోకలు ప్రారంభమైతే ఖమ్మం, వైరా, సత్తుపల్లి ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి వైపు వెళ్లే దాదాపు 90 శాతం వాహనాలు ఈ జాతీయ రహదారినే వినియోగిస్తాయని తెలిపారు. ప్రజలకు ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి భవిష్యత్తులో పరిశ్రమలు, వాణిజ్యం, ఉపాధి అవకాశా లకు పెద్ద ఎత్తున దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ రహదారి ద్వారా రాజమండ్రికి కేవలం రెండు గంటల్లో చేరుకోవచ్చని తెలిపారు. యాక్సెస్ కంట్రోల్డ్ హైవే కావడంతో జంతువులు, ఆటోలు, అనధికార క్రాసింగ్‌లు వంటి అంతరాయాలు లేకుండా సురక్షి త ప్రయాణం సాధ్యమవుతుందన్నారు. అమరావతి నుంచి భద్రాచలం మీదుగా జగదల్‌పూర్ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి ప్రతిపాదన ఉందని తెలిపారు. మణుగూరు నుంచి ఏటూరునాగారం మీదుగా నాగపూర్ వెళ్లే జాతీయ రహదారి కూడా రానుందని చెప్పారు.



కరీంనగర్- వరంగల్ నుంచి అమరావతికి వెళ్లే రహదారి పనులు కొనసాగుతున్నాయని, భూసేకరణ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఆలస్యం జరుగుతోం దన్నారు. ఖమ్మం-అశ్వారావుపేట రహదారిని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కి అప్పగించామని, నాలుగు లైన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని, వెంటనే డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం ప్రవేశం నుంచి అశ్వారావుపేట వరకు ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనల ప్రకారం మార్కింగ్ పూర్తి చేసి రహదారి పక్కన ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. తాను మంత్రి అయినప్పుడు ఖమ్మం జిల్లాలో ఒక్క సెంటీమీటర్ జాతీయ రహదారి కూడా లేదని, ప్రస్తుతం అన్ని దిశల్లో జాతీయ రహదారులు అభివృద్ధి చెందడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. సమన్వయంతో అమరావతి రహదారికి సంబంధించిన సమస్యలను పరిష్కరించి జిల్లా పరిధిలో పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కామాంచికల్ మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డును పొన్నెకల్ నుంచి అమరావతి రహదారికి రూ.120 కోట్లతో అనుసంధానం చేస్తున్నామని, ఆ రహదారి పూర్తయితే ఇల్లెందు, వైరా ప్రాంతాల ప్రజలు ఖమ్మం నగరంలోకి రాకుండానే తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతీయ రహదారుల అనుసంధానంతో ఖమ్మం నగరానికి ఔటర్ రింగ్ రోడ్ తరహా వ్యవస్థ ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రత్యేక ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించినా నిధుల కొరతతో సాధ్యం కాలేదని, ఇప్పుడు జాతీయ రహదారుల ద్వారానే ఆ లక్ష్యం నెరవేరిందన్నారు. ఈ జాతీయ రహదారి ప్రారంభంతో ఖమ్మం నగరం ట్రాఫిక్ రహితంగా మారుతుందని తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ విలువైన భూములను అందించిన రైతులకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సహకారం వల్లే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు వేగంగా పూర్తి దశకు చేరుకుందని, జిల్లా అభివృద్ధిలో రైతుల సహకారం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. అవసరమైన చోట రోడ్ల విస్తరణ చేపట్టి ఫుట్‌పాత్‌లు నిర్మించాలని, ఫుట్ పాత్‌లపై ఎలాంటి ఆక్రమణలు అనుమతించవద్దన్నారు. ఫుట్‌పాత్‌లపై ఉన్న వీధి వ్యాపారులకు పునరావాసం కల్పించిన తర్వాత మాత్రమే తొలగించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలను తొలగించిన అనంతరం రోడ్ల విస్తరణ చేపట్టాలని, నగరంలో ప్రణాళికాబద్ధంగా పూల మొక్కలు, పండ్ల మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. ఖమ్మం ఇతర నగరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గోదావరి జలాలను మున్నేరుకు తీసుకురావడం తన అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. రాజీవ్ లింక్ కాలువ వద్ద షట్టర్లు మూసి బ్యాక్ వాటర్‌ను మంచుకొండ లెఫ్ట్ కాలువ ద్వారా మళ్లించడం వల్ల మున్నేరులో నీటి ప్రవాహం కొనసాగుతుందని, భవిష్యత్తులో ఖమ్మం నగరానికి తాగునీటి సమస్య ఉండదన్నారు. ప్రస్తుతం పాలేరు ప్రాజెక్టులో కేవలం 90 రోజుల త్రాగునీటి నిల్వ మాత్రమే ఉందని, నిపుణులు రానున్న నాలుగేళ్లు కరువు పరిస్థితులు కొనసాగే అవకాశముందని చెబుతున్న నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పనులను వేగంగా పూర్తి చేస్తున్నందుకు మంత్రి అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. ఒక మంచి రహదారి ఏ గ్రామానికైనా, పట్టణానికైనా వంద రెట్లు అభివృద్ధిని తీసుకువస్తుందని అన్నారు. కొత్త రహదా రులతో పాటు కొత్త అవకాశాలు, కొత్త సవాళ్లు కూడా వస్తాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. రైతులకు సౌకర్య వంతమైన రాకపోకల కోసం అవసరమైన చోట అండర్ పాస్‌లను త్వరితగతిన ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాతీయ రహదారిపై వేగ పరిమితులను ఖచ్చితంగా అమలు చేస్తామని, ఎలాంటి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి అందుబాటులోకి రావడంతో ఖమ్మం నగర ట్రాఫిక్ గణనీయంగా తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరె క్టర్ దివ్య, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఎరువుల పంపిణీలో పారదర్శకత పాటించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్**

**రైతులు ఈ నిర్ణయాన్ని అర్థం చేసుకొని సహకరించాలి**

**జులై 15 నుంచి ఫ్రైట్ లారీ (ఎఫ్ ఓ ఎల్) సౌకర్యం నిలిపివేత**

**మార్క్ ఫెడ్ సరఫరా చేసే ఎరువులకు మాత్రమే రవాణా చార్జీలు వసూలు చేయాలి**

ప్రభాతవార్త కలెక్టరేట్ జూలై 22

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు మేరకు ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం 2026 జూలై 15 నుంచి మార్కెట్ ద్వారా ఇప్పటివరకు అమల్లో ఉన్న ఫ్రైట్ ఆన్ లారీ (ఎఫ్ ఓ ఎల్ ) సౌకర్యాన్ని నిలిపి వేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో మార్క్ ఫెడ్ గిడ్డంగులు (ఎక్స్ వేర్ హౌస్ ) లేదా రేక్ హెడ్ లా (ఎక్స్ రేఖ హెడ్ ) నుంచి సరఫరా ఎరువులకు సంబంధించిన రవాణా చార్జీలు మాత్రమే రైతుల నుంచి నిర్ణయించిన రేట్ల ప్రకారం వసూలు చేయాలని సూచించారు. మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ నిర్ణయించిన రవాణా చార్జీల జాబితాకు అనుగుణంగానే వసూళ్లు చేపట్టాలని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసిఎస్) ఆర్థిక నష్టం కలగ కుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తుందని కలెక్టర్ తెలియజేశారు. ఎరువుల విక్రయానికి, రవాణా చార్జీల వస్తువులకు వేరు, వేరు రసీదు పుస్తకాలు నిర్వహించాలని, రైతుల సంతకాలతో ప్రత్యేక రసీదులు తప్పనిసరిగా జారీ చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ప్రతి పీఏసీఎస్ కార్యాలయం నందు ఎరువుల విక్రయ కేంద్రంలో రవాణా చార్జీల వివరాలు ప్రత్యేక బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని తెలియజేశారు. అలాగే పిఎసిఎస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యులు, రైతులకు రవాణా చార్జీలపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రవాణా చార్జీల వస్తువులలో పూర్తి పారాదర్శకత, జవాబుదారితనం పాటించాలని ప్రతి లావాదేవీకి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. కంపెనీల నుంచి నేరుగా ఎఫ్ఓఎల్ విధానంలో సరఫరా అయ్యే ఎరువులకు ఎలాంటి రవాణా చార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని ఎరువుల పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, జవాబు దారితనం పెంపొందించేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. రైతులు ఈ నిర్ణయాన్ని అర్థం చేసుకొని సహకరించాలని, ప్రభుత్వం నిర్ణయించిన రవాణాచార్జీలు మాత్రమే చెల్లించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు మొత్తాలు చెల్లించవద్దని సూచించారు. ఏమైనా అక్రమ వసూలు జరిగినట్లయితే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకు రావాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే ఎరువుల ఆమ్మాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుల నుంచి అదనపు మొత్తానికి వసూలు చేయరాదని, ప్రభుత్వ జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని ప్రాథమిక సహకార సంఘాల కార్యదర్శులు, విక్రయ సిబ్బంది తప్పనిసరిగా అమలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

## స్త్రీ నిధి రుణాల రికవరీకి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి

**కలెక్టర్ అంకిత్**

కొత్తగూడెం, జూలై 22 ప్రభాతవార్త

జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, వచ్చే రెండు నెలల్లో కనీసం 60 శాతం రికవరీ సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి స్త్రీ నిధి సమీక్ష కమిటీ సమావేశంలో స్త్రీ నిధి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాచందనతో కలిసి జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ, పెండింగ్ బకాయిలు, మండలాల వారీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రికవరీ శాతం తక్కువగా ఉన్న మండలాల ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులను జిల్లా కలెక్టర్ నేరుగా కారణాలు అడిగి తెలుసుకున్నారు. రికవరీలో వెనుకబడడానికి దారితీసిన అంశాలను విశ్లేషించి, ఆయా మండలాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ ఆశించిన స్థాయిలో లేదని, మండల స్థాయిలో పెండింగ్ బకాయిలు అధికంగా ఉన్నాయని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీ శాతం కేవలం 13.5 శాతం మాత్రమే ఉండగా, రాష్ట్రంలో జిల్లా 31వ స్థానంలో ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రికవరీ పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 239 వీవోల వద్ద సున్నా కలెక్షన్లు నమోదయ్యాయని తెలిపారు. ముఖ్యంగా భద్రాచలం, పాల్వంచ, ఇల్లందు, అశ్వరావుపేట ప్రాంతాల్లో రికవరీ శాతం తక్కువగా ఉందని పేర్కొంటూ, ఈ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి రుణ గ్రహీతలను కలిసి అవగాహన కల్పించాలని ఆదేశించారు.

# రైతులు ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేసుకోవాలి

**- నీటిపారుదల శాఖ డిఈఈ జి.మరియన్న**

**పెనుబల్లి, జులై 22, ప్రభాతవార్త:**

ఎల్ నీనో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని అందువల్ల రైతులు వరి సాగుకి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలపై దృష్టి సారించాలని నీటిపారుదల శాఖ డి ఈ ఈ జి.మరియన్న వ్యవసాయానికి సంబంధించిన ఎనిమిది శాఖల అధికారులు, రైతులకు సూచించారు. బుధవారం పెనుబల్లిలోని రైతు వేదికలో ఎల్ నినో పైన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పంచాయతీరాజ్, విద్యుత్ ,రెవిన్యూ, నీటిపారుదల, గ్రామీణ నీటిపారుదల శాఖ, పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ మండలంలోని ఎనిమిది శాఖల అధికారులు సమన్వయంతో మండలంలోని అన్ని పంచాయతీలలో రైతులతో సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సదస్సులో ముఖ్యంగా పంచాయతీ సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించే విధంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని



సూచించారు. ఏవో ప్రసాద్ రాజు మాట్లాడుతూ గడచిన 75 సంవత్సరాల్లో వర్షాభావం తక్కువ నమోదైన సంఘటనలు లేవని ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాభావం తక్కువగా ఉందని అన్నారు. రైతులు వరి సాగు పట్ల మొగ్గు చూపకుండా ఇతర పంటలు పెసలు, మినుములు, శనగ వంటి పంటలు సాగు చేస్తే వర్షాలు తక్కువగా ఉన్న పంటలు రైతుల చేతికి దక్కుతాయని అన్నారు. ఈ సమావేశంలో తాసిల్దార్ వీరభద్ర నాయక్, ఏవో ఏవీఎస్ ప్రసాద్ రాజు, నీటిపారుదల శాఖ డి ఈ రామారావు, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ విజయ, విద్యుత్ శాఖ ఏఈ భుజంగరావు ఇన్చార్జి ఎంపీడీవో, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, లంకపల్లి సర్పంచ్ రాజాబాబు, గంగ దేవి పాడు సర్పంచ్ రాధాకృష్ణ, చీకటి రామారావు, రైతులు పాల్గొన్నారు.

# పొంగులేటి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్నసేవలు అమోఘం..

- కల్లూరు ప్రభుత్వ స్కూళ్ళల్లో మీ ట్రస్ట్ సేవలు విరివిగా అందించాలి
- మర్యాదపూర్వకంగా రెవెన్యూ మంత్రి, కల్లూరు ముద్దు బిడ్డ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురిని కలిసిన కల్లూరు మున్సిపల్ చైర్మన్, కౌన్సెలర్లు యాసా నాగమణి శ్రీకాంత్‌లు

**కల్లూరు, జులై 22, ప్రభాతవార్త:** కల్లూరు మండలం నారాయణపురం కు రెవెన్యూ మంత్రి సతీమణి పొంగులేటి మాధురి రావడం తో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, యాస శ్రీకాంత్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పి ఎస్ ఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడి కల్లూరు లోని ప్రభుత్వ స్కూల్లో మరికొన్ని అవసరాలు మీరు తీర్చాలని కోరగా తప్పకుండా మా ట్రస్ట్ ద్వారా సేవలు అందుతాయి అని, ఏ అవసరం ఉన్నా మా దృష్టికి తీసుకురరండి అని, విద్యార్థులకు మంచి విద్యను మంచి ఆహారాన్ని అందించండి అని తెలియజేశారు. ఈ



సందర్భంగా కల్లూరు కౌన్సిలర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి,15 వార్డ్ కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్, 16వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు,19 వార్డ్ కౌన్సిలర్ కాంపాటి రాధా వీరస్వామి, కాంగ్రెస్ నాయకులు బొల్లం ఉపేందర్ గౌడ్, కాపునాయకుడు, కాంగ్రెస్ నాయకుడు మండలి సుబ్బారావు, కాంగ్రెస్ నాయకులు ధరవాత్ రవికుమార్, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

# దేశ విద్రోహ శక్తులతో కాంగ్రెస్ చీకటి కుట్రలు

**- దేశ భద్రతతో చెలగాటమాడితే ఉక్కు పాదం తప్పదు**

**- ఖమ్మంలో భగ్గుమన్న బిజెపి**

**- రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం**

**ప్రభాతవార్త గాంధీ చౌక్ జులై 22:**



దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న దిగజారుడు రాజకీయ నాటకాలను, దేశ విద్రోహశక్తులతో కలిసి పండితుల కుట్రలను తీవ్రంగా ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా శాఖ నిరసన చేపట్టింది. ఖమ్మం జిల్లా బిజెపి అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తీవ్ర నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ వైఖరికి, రాహుల్ గాంధీ బాధ్యతారాహిత్యానికి నిరసనగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ప్రబారి, మాజీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు కాంగ్రెస్ అధిష్టానం పై నిప్పులు చెరిగారు. పార్లమెంటు లో ప్రతిపక్ష నేతగా బాధ్యతాయుతంగా వ్యవహరించడంలో రాహుల్ గాంధీ పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ అంశంపై పార్లమెంట్ లో చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వయంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సిద్ధంగా ఉన్నామనీ స్పష్టం చేసినప్పటికీ, చర్చల నుంచి కాంగ్రెస్ పారిపోయిందని విమర్శించారు. సభలో ప్రజా సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక వీధుల్లో రచ్చ చేయటం రాహుల్ గాంధీ అపరిపక్వ రాజకీయాలకు నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోడీ నివాసం ముట్టడి పేరుతో చౌకబారు విన్యాసాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా విద్యార్థుల ను



రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని, ప్రజలకు గాలిలో విప్లవం వాసన కంటే కాంగ్రెస్ కుట్రల వాసనే స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి చేసిన వ్యాఖ్యలకు వారు స్పందిస్తూ, అమాయక విద్యార్థులు రోడ్లపైకి తీసుకువచ్చి రాజకీయ ప్రయోజనాలు పొందాలని ప్రయత్నించటం కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన పేరిట కొందరు బారికేడ్లు ధ్వంసం చేసి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడడంతో నే పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాటి చార్జ్ చేయాల్సి వచ్చిందని తెలిపారు. పార్లమెంటు, ప్రజా ఆస్తులు, శాంతి భద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, ఆ చర్యలను రాక్షసత్వంగా అభివర్ణించటం చట్టాలను అపహాస్యం చేయడమేనని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన నాయకులు రాష్ట్రంలో ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే రాజభవన్ ముట్టడి వంటి కార్యక్రమాలకు తెర లేపిందని ఆరోపించారు. మంత్రి పొంగులేటి, పిసిసి నాయకత్వం ఢిల్లీ రాజకీయాలను హైదరాబాదులో ప్రదర్శించడం కేవలం రాహుల్ గాంధీ మెప్పుకోసం చేస్తున్న పబ్లిసిటీ స్టంట్ మాత్రమే అని విమర్శించారు. తెలంగాణలో విద్యార్థులు, నిరుద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటిని పక్కనపెట్టి ఢిల్లీ రాజకీయాలపై మాట్లాడటం బాధ్యతారాహిత్యం అని అన్నారు. ముందుగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పాలనపై దృష్టి సారించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై నిరాధారణ ఆరోపణలు చేయడం కంటే ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రుద్ర ప్రదీప్, దొంగల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్త వెంకటేశ్వరరావు, ఆర్ వి ఎస్ యాదవ్, శాసనాల సాయిరాం, వీరవల్లి రాజేష్, పమ్మి అనిత, అల్లిక అంజయ్య, కొనతం లక్షీ ్మనారాయణ, బోయల వెంకట్, నెల్లూరు బెనర్జీ, నడికంటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# నేడు సత్తుపల్లికి రానున్న ఉప ముఖ్యమంత్రి బట్టి...

**సత్తుపల్లి జూలై 22 ప్రభాతవార్త:**



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక మంత్రి మల్లు బట్టి విక్రమార్క గురువారం సత్తుపల్లి రానున్నారు. హైదరాబాదులో ఉపముఖ్యమంత్రి ఉదయం రోడ్డు మార్గం గుండా బయలుదేరి సత్తుపల్లి కి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకో ఉన్నట్లు డీసీఎం వ్యక్తిగత సహాయ కార్యదర్శి భాస్కర శర్మతెలియజేశారు. సత్తుపల్లిలోని జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ గనిని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానందు, సింగరేణి అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించనున్నారు. అనంతరం ఓపెన్ కాస్ట్ లో ఉత్పత్తి అవుతున్న బొగ్గు, నాణ్యత ప్రమాణాలపై సింగరేణి అధికారులతో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్ర మార్క సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం ఇక్కడి నుంచి డీసీఎం బట్టి ఇల్లందు బయల్దేరునున్నారు. ఈ మేరకు సింగరేణి అధికారులు ఆయన పర్యటన గురించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# కేసీఆర్ కృషితోనే సీతారామ ప్రాజెక్టు నీళ్లు

**- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**ఖమ్మం అర్బన్, జులై 22(ప్రభాతవార్త):**



సీతారామ ప్రాజెక్టు ఆలోచన నుంచి నిర్మాణ పురోగతి వరకు ప్రతి దశలోనూ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న దూరదృష్టి నిర్ణయాలు, నిరంతర కృషి ఫలితంగానే ప్రస్తుతం ఖమ్మం జిల్లా రైతులకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందుతున్నాయని తెలిపారు.ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 1600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నామంటే అది నాడు కేసీఆర్ ఆలోచించిన మహత్తర ప్రాజెక్టు కార్యరూపం దాల్చిన ఫలితమేనని అన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాలోని కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందడంతో రైతులకు ఎంతో ఉపశమనం లభిస్తుందని, వ్యవసాయ రంగానికి ఇది మరింత బలాన్ని చేకూరుస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీతారామ ప్రాజెక్టు కోసం సుమారు రూ.9 వేల కోట్లకు పైగా నిధులు వెచ్చించి 100 కిలోమీటర్లకు పైగా ప్రధాన కాలువలు, పంప్ హౌస్‌లు, పైప్‌లైన్లు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలను నిర్మించామని వివరించారు. అధిక సామర్థ్యం కలిగిన మోటార్లు, ఆధునిక యాంత్రిక పరికరాలు, భారీ పంపింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రాజెక్టు పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, ఖమ్మం జిల్లా రైతుల భవిష్యత్తును మార్చే కీలకమైన ప్రాజెక్టు అని ఆయన అన్నారు. గతంలో వర్షాలపై ఆధారపడిన అనేక ప్రాంతాలకు ఇప్పుడు సాగునీటి భరోసా లభించే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

# ఈ నెల 24న డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

**మణుగూరు, ప్రభాతవార్త, జూలై 22:**



రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఈ నెల 24న మణుగూరు మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 9:20 గంటలకు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్ )లో నూతనంగా ఏర్పాటు చేసిన డిఏవి స్కూల్‌ను ఆయన ప్రారంభిస్తారు. అనంతరం 10:30 గంటలకు సింగరేణి మణుగూరు ఏరియాలోని ఓపెన్ కాస్ట్‌లను సందర్శించి బొగ్గు ఉత్పత్తి, రవాణా ప్రక్రియలను పరిశీలిస్తారు. తర్వాత సింగరేణి అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. డిప్యూటీ సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జెన్‌కో, సింగరేణి అధికారులు బుధవారం తెలిపారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన మాజీ సర్పంచ్ మర్రి

**అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 22:**

అశ్వాపురం మండలం, మొండికుంట గ్రామానికి చెందిన డేరంగుల రామస్వామి మృతి పట్ల మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మర్రి మల్లారెడ్డి, బాధలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని,తాను ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.మానవత్వానికి నిదర్శనంగా మృతుడి కుటుంబానికి తన వంతు సహాయంగా అంత్యక్రియలు ఖర్చు నిమిత్తం



రూ.5,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఆయన చేసిన పరామర్శ,ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు కొంత ఊరటనిచ్చిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడి తొలిముద్ద సంపూర్ణారోగ్యానికి బాట

## - గొందిగూడెం సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి

**అశ్వాపురం,ప్రభాతవార్త, జూలై 22;**

గొందిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్ వాడి కేంద్రంలో సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి ్ర ముఖ్య అతిథిగా విద్యార్థులకు తొలిముద్ద కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్ వాడి లో చిన్నారులకు తొలిముద్ద కార్యక్రమం ద్వారా చిన్నారులకు పోషకాహారం లభిస్తుందని,తద్వారా సంపూర్ణారోగ్యం లభిస్తుందని,రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను వివరించి,వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య



ఆహారం ఎంతో అవసరమని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్ లు,అంగన్ వాడి సిబ్బంది,విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామికం

## - వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## - అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ ధర్నా

**ఖమ్మం జూలై 22, ప్రభాతవార్త:**

ఏ ఐ సి సి ఆదేశానుసారం, టి పి సి సి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ,ప్రతిపక్ష నాయకుల అరెస్టు ను ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్ పై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి ర్యాలీగా బయలుదేరి ఖమ్మం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాల్లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామిక మని అన్నారు. నీట్ పేపర్ లీక్ పై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు.నీట్ పరీక్ష నిర్వహించలేని దద్దమ్మ కేంద్ర ప్రభుత్వం అని, విద్యార్థులు,నిరుద్యోగులు డిల్లీ వీధుల్లో ఆందోళన చేస్తుంటే ప్రధాని మోడీ మోనంగా ఎందుకు అని శాంతియుతంగా నిరసనలు చేసే యువతపై అత్యంత పాశవికంగా లాఠీ చార్జి ని ఖండిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ పి సి సి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ అరెస్ట్ ను ఖండిస్తూ నీట్ పేపర్ లీక్ పై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ, నిరసన ధర్నా నిర్వహించామని కేంద్ర ప్రభుత్వం నిరంకుశపాలనకు చరంగీతం పాడాలని , కేంద్ర ప్రభుత్వ పతనానికి కథం తొక్కిన యువతే నిదర్శనమని అదే విధంగా తెలంగాణాలో గత ప్రభుత్వ హయాంలో పరీక్షలు నిర్వహించలేని అసమర్థ పాలకులను గద్దె దించారని అన్నారు. సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం నీట్ పేపర్ లీక్ పై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని యావత్ భారత్ యువత భవిష్యత్తు ను అంధకారంలోకి నెట్టిందని రాహుల్ గాంధీ అరెస్ట్ ను తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్




రాయల నాగేశ్వరరావు,శాసనమండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, టి పి సి సి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి,రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భానోత్ బాలాజీ నాయక్, రాష్ట్ర ఓ బి సి సెల్ ఉపాద్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, రంగా జనార్ధన్,సహేల జావేద్, పి సి సి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, ఏ ఐ సి సి సేవాదళ్ కో ఆర్డినేటర్ చోటా బాబా,రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బండి మాధవరావు,పి ఏ సి ఎస్ చైర్మన్ రావూరి సైదు బాబు,విప్లవ కుమార్,యర్రం బాలగంగాధర్ తిలక్,మాజీ కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వరరావు,దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, రాపర్తి శరత్,మిక్కిలినేని మా మంజులనరేంద్ర, కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, నగర మైనారిటీ అద్యక్షులు అబ్బాస్ బేగ్, జిల్లా కాంగ్రెస్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు పట్టాభి,కిలారు అనిల్ కుమార్, బచ్చలకూర నాగరాజు,దామా స్వరూప, ముక్రం అలీ ఖాన్,గాదెల ఝాన్సీ, శంకర్ నాయక్,ఫతే అహ్మద్, భానోత్ వినోద , మద్దినేని రమేష్,లింగాల రవికుమార్,జిల్లా కాంగ్రెస్ ఓ బి సి సెల్ ఉపాద్యక్షులు గజ్జి సూర్యనారాయణ,గడ్డికొప్పుల ఆనందరావు, రజీభాయ్, దివ్య ,జహీర్ భాయ్, బీరెడ్డి రమేష్, ఫరీద్ ఖాద్రి,ఆసిఫ్, పంది రాజు గౌడ్,ప్రతిభారెడ్డి,అన్నపూర్ణ యశ్వంత్, కందుల శ్రీను,వీరయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అల్పాహారం ట్రైలర్ రన్ ప్రారంభం

**బోనకల్, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని స్థానికప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈరోజు అల్పాహారం పథకం ట్రయల్ రన్ లో భాగంగా కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు అల్పాహారం గా పూరీ ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా ప్రభుత్వం అందించే అల్పాహారం ని విద్యార్థులుసద్వినియోగం చేసుకొని మంచి మార్కులు తెచ్చుకుని వారి కుటుంబాలకు , కళాశాలకు , వారి గ్రామాలకు పేరుతేవాలని పేర్కొన్నారు. విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క లకు కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.